www.vaarthavedhikasurya.com
PRGI.NO:- TGTEL/25/A0305
# వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

యాదాద్రి భువనగిరి | YADADRI BHUVANAGIRI
సంపుటి: 1 | VOLUME : 1
సంచిక: 306 | ISSUE : 306
గురువారం, 2 ఏప్రిల్, 2026 | THURSDAY, APRIL 2, 2026
ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి | EDITOR : POLOJU SRINIVASA CHARY
పేజీలు: 8 | PAGES : 8
వెల: 5-00 | RS : 5-00

## మార్జిన్ పెంచేవరకు సమ్మె

- రిటైల్ చికెన్ షాపుల యజమానుల ప్రకటన
- కిలో చికెన్‌కు మార్జిన్ రూ.40 ఇవ్వాలని డిమాండ్
- ఇందిరాపార్కు వద్ద తెలంగాణ రిటైల్ చికెన్ షాప్స్ అసోసియేషన్ ధర్నా..
- రాష్ట్రంలో సమ్మె ప్రభావం పాక్షికం

2 లో..

# ఎల్డీఎఫ్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్లే..

- మోదీ, విజయన్‌లను ఓడిస్తేనే మంచి రోజులు వ్యాఖ్య
- కేరళ ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్ హోదాలో ప్రచారం
- నేమం సహా పలు నియోజకవర్గాల్లో జోరుగా ప్రచారం
- మోహన్‌లాల్ డైలాగ్‌లతో సీఎం పినరయి విజయన్‌కు సెటైర్లు
- హస్తానికి ఓటేస్తే పాత కేరళను చూపిస్తామని రేవంత్‌రెడ్డి హామీ

హైదరాబాద్/ఎర్నాకులం, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 1:

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేరళ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్ హోదాలో కేరళ వెళ్లిన రేవంత్ రెడ్డి.. నేమం, తిరువనంతపురం, అలప్పుజ, ఎర్నాకుళం సహా పలు నియోజకవర్గాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎల్డీఎఫ్‌కు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లేనని పేర్కొన్నారు. ఢిల్లీ కమ్యూనలిస్టు ప్రధాని మోదీ.. తిరువనంతపురం కమ్యూనిస్టు పినరయి విజయన్‌ను ఓడిస్తేనే కేరళకు మంచిరోజులు వస్తాయన్నారు. కేరళలో ఎల్డీఎఫ్, బీజేపీ మధ్య ఒప్పందాలు ఉన్నాయని, మోదీ, విజయన్‌లవి భిన్న భావజాలాలైనా భావాలు మాత్రం ఒక్కటేనని వ్యాఖ్యానించారు. 'నీ పో మోనే విజయా..!' (విజయన్ నువ్వు దిగిపో) అంటూ ప్రముఖ సినీనటుడు మోహన్‌లాల్ పంచ్ డైలాగ్‌ను సీఎం పినరయి విజయన్‌కు అన్వయించి పలికి కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. నేమం నియోజకవర్గంలో యూడీఎఫ్ అభ్యర్థి కేఎస్ శబరీనాథన్ తరఫున పూంథురలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మిగతా 2లో..



పశ్చిమ ఆసియా యుద్ధం వల్ల కేరళీయుల కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. దాదాపు 45 లక్షల మంది మలయాళీలు గల్ఫ్‌లో పనిచేస్తున్నారు. యుద్ధం కారణంగా వారు తిరిగి వచ్చి వారు తమ సొంత దేశంలో పనిచేయాలనుకుంటున్నారు. కానీ ఇక్కడ అవకాశాలు లేవు. వాళ్లు ఈ కేరళంను అభివృద్ధి చేయాలనుకుంటున్నారు. పరిశ్రమలు లేవు. కేరళంను ఎవరు అభివృద్ధి చేస్తారో ఆలోచించి మనం ఓటు వేయాలి. కేరళంకు ఎవరు పెట్టుబడులు తీసుకువస్తారో ఆలోచించాలి. ఆ బాధ్యతను యూడీఎఫ్ తీసుకుంటుంది.
- రేవంత్ రెడ్డి
(తెలంగాణ ముఖ్యమంత్రి)

## మీ సేవా చార్జీల భారీ పెంపు

- ఆయా సేవలపై 18% జీఎస్టీ ఇకపై వినియోగదారులే చెల్లించాలి
- సవరించిన ధరలు తక్షణమే అమల్లోకి..

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 1:

రాష్ట్రంలో మీ సేవ కేంద్రాల్లో అన్ని సేవల ధరలను ప్రభుత్వం భారీగా పెంచింది. ఆయా సేవలపై 18 శాతం జీఎస్టీని ఇకపై వినియోగదారులే చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ జీవో నంబర్ 1ని విడుదల చేసింది. ఈ సవరించిన ధరలు తక్షణమే అమల్లోకి వచ్చినట్లు ప్రభుత్వం స్పష్టం చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. క్యాటగిరీ-ఏ కింద సేవలకు వసూలు చేసే రుసుం గతంలో రూ.35గా ఉండగా.. ప్రస్తుతం రూ.62కు పెంచారు. ఈ క్యాటగిరీలో అడంగల్, పహాణీ, జనన ధ్రువీకరణ పత్రం ప్రింట్ వంటి తక్షణ సేవలున్నాయి. ఇక క్యాటగిరీ-బీ సేవల చార్జీలు గతంలో రూ.45 ఉండగా.. రూ.80కి పెరిగాయి. ఇందులో కుల, ఆదాయ, నివాస, మిగతా 2లో..

## 'కమర్షియల్'పై మళ్లీ బాదుడు

### 19 కిలోల సిలిండర్ ధర రూ.195.50 మేర పెంపు

- ప్రభుత్వరంగ చమురు సంస్థల నిర్ణయం
- రూ.2,320కి చేరుకున్న సిలిండర్ ధర
- ప్రీమియం పెట్రోల్‌పై లీటరుకు రూ.11 వడ్డన ప్రీమియం డీజిల్ మీద లీటరుకు రూ.1.50
- పెరిగిన విమాన ఇంధన ధరలు..

న్యూఢిల్లీ: వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధర మరోసారి పెరిగింది. 19 కిలోల సిలిండర్ ధరను రూ.195.50 మేర పెంచుతూ ప్రభుత్వరంగ చమురు సంస్థలు బుధవారం నిర్ణయం తీసుకున్నాయి. దీంతో హైదరాబాద్‌లో సిలిండర్ ధర పన్నులు కలుపుకొని రూ.2,320కి చేరుకుంది. ప్రీమియం, బ్రాండెడ్ పెట్రోల్, డీజిల్ ధరలను కూడా చమురు కంపెనీలు పెంచాయి. ఢిల్లీలో ప్రీమియం పెట్రోల్(ఎక్స్‌పీ 100) ధరను లీటరుకు రూ.11 పెంచడంతో రూ.160కి చేరుకోగా, ఎక్స్‌ట్రాగ్రీన్ డీజిల్ ధర లీటరుకు రూ.1.50 పెరిగి రూ.92.99కి చేరింది. విమాన ఇంధన (ఏటీఎఫ్) ధర 114 శాతం పెరిగి మిగతా 2లో..




# ఇకపై 'స్మార్ట్'గా భూ రెవెన్యూ 'సర్వే'

- అన్నదాత అరచేతిలో 'సమీకృత భూభారతి' పోర్టల్
- నేటి నుంచి 5 మండలాల్లో ప్రయోగాత్మకంగా పోర్టల్ అమలు
- అధికారులకు పొంగులేటి దిశా నిర్దేశం

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 1:

రోజురోజుకు సాంకేతికత కొత్త రూపును సంతరించుకుంటోంది. గతంలో ఉన్నత విద్యావంతులకే పరిమితమైన టెక్నాలజీ ప్రస్తుతం సామాన్యులు, రైతుల అరచేతిలోనే ప్రత్యక్షమవుతోంది. ఇప్పుడు 'మీ వద్ద స్మార్ట్ ఫోన్ ఉంటే సరి.. మీ భూ వివరాలు' తెలుసుకోవచ్చు. సామాన్య రైతుల భూసమస్యల పరిష్కారానికి 'సమీకృత భూభారతి' పోర్టల్‌ను రాష్ట్ర ప్రభుత్వం తెచ్చింది. గతంలో మాదిరిగా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రైతులు 'మీ సేవా కేంద్రాలకు వెళ్లాల్సిన పని లేదు' అని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. ఇంట్లో నుంచే స్మార్ట్ ఫోన్ ద్వారా భూసేవలు పొందడానికి పోర్టల్ రూపొందించామన్నారు. అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని రైతులు పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకుని సేవలను పొందవచ్చునని తెలిపారు. రెవెన్యూ సంస్కరణల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు పారదర్శక సేవలకు వీలుగా ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెచ్చి రూపొందించిన 'సమీకృత భూ భారతి' పోర్టల్‌ను గురువారం (ఏప్రిల్ 2) నుంచి నారాయణపేట జిల్లా కోస్గి, ఖమ్మం జిల్లా కూసుమంచి, కొత్తగూడెం-భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూనే.. పోర్టల్ ప్రారంభానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయన రెవెన్యూ అధికారులకు బుధవారం టెలి కాన్ఫరెన్స్‌లో దిశా నిర్దేశం చేశారు. పోర్టల్ నిర్వహణపై సంబంధిత జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ మండలాల నుంచి వచ్చే ఫలితాల ఆధారంగా మార్పులూ చేర్పులతో రెండో దశలో రాష్ట్రమంతా అమలు మిగతా 2లో..





## ఆయిల్ పామ్ ధర రూ.1459 మేర పెంపు

- ఆయిల్ పామ్ సాగు పెరిగే అవకాశం: మంత్రి తుమ్మల

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 1:

రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం కలిగించే దిశగా మరో సానుకూల పరిణామం చోటుచేసుకుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటివరకు టన్నుకు రూ.21,546గా ఉన్న గెలల ధర.. రూ.1,459 మేర పెరిగి ప్రస్తుతం రూ.23,005కు చేరిందని బుధవారం ఆయన

## కన్నవారితో రాజీకి ప్రయత్నించండి

- నిరాదరణకు గురవుతున్న తల్లిదండ్రులకు హైకోర్టు హితవు
- నేరుగా కోర్టులకు రావడం సరికాదని ధర్మాసనం అభిప్రాయం
- సానుకూల ధోరణితో సమస్యను పరిష్కరించుకోవాలని సూచన



హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 1:

పిల్లల నిరాదరణకు గురవుతున్నామంటూ తల్లిదండ్రులు నేరుగా కోర్టులకు రావడం సరికాదని హైకోర్టు అభిప్రాయపడింది. కన్నవారితో రాజీ ప్రయత్నాలు చేయాలని హితవు పలికింది. తొలుత సానుకూల ధోరణితో సమస్యను పరిషరించుకొనే చర్యలు చేపట్టాలని సూచించింది. ఇలా చేయకుండానే పిల్లల నుంచి ఆస్తులను ఖాళీ చేయించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోర్టులను కోరుతున్నారని పేర్కొన్నది. తనను పట్టించు కోని కుమారుడి నుంచి ఆస్తిని ఇప్పించాలన్న తన అభ్యర్థనలను అధికారులు పట్టించుకోకపోవడంతో సూర్యాపేట జిల్లాకు చెందిన 66 ఏండ్ల వృద్ధురాలు వేసిన పిటిషన్‌ను బుధవారం జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి మిగతా 2లో..



## యుద్ధంలో చేరే ప్రసక్తే లేదు!

- యూకే ప్రధాని సర్ కీర్ స్టార్మర్
- మా దేశ ప్రయోజనాలే మాకు ముఖ్యం..
- ట్రంప్‌నకు స్పష్టం చేసిన బ్రిటన్

2 లో..

# హైదరాబాద్‌లో 1,000 కిలోల కుళ్లిన మాంసం పట్టివేత

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 1:

హోటల్‌కు వెళ్లి మటన్ బిర్యానీ, పాయా, తలకాయ కర్రీ వంటివి ఆర్డర్ చేసుకొని ఇష్టంగా తింటున్నారా..? మీరు తినేది ఫ్రెష్ మటనా..? లేక రోజుల తరబడి నిల్వ ఉంచిన కుళ్లిన మాంసమా..? అనే విషయం గురించి ఎప్పుడైనా ఆలోచించారా..? ఎందుకంటే.. తాజాగా హైదరాబాద్ చరిత్రలోనే అతిపెద్ద ఆహార కల్తీ దందా బట్టబయలైంది. మంగళ్‌హాట్ కేంద్రంగా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మాంసం మాఫియా గుట్టును గోల్కొండ జోన్ టాస్క్‌ఫోర్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు, జీహెచ్ఎంసీ టీం రట్టు చేసింది. మెరుపు దాడుల్లో భారీగా మాసం నిల్వలు బయటపడ్డాయి. అక్కడి దృశ్యాలు చూసి అధికారులు సైతం ఆశ్చర్యపోయారు. రెండు భారీ గోదాముల్లో నిల్వ ఉంచిన సుమారు 10 టన్నులు మిగతా 2లో..





- బిర్యానీ తయారీకి చనిపోయిన గొర్రెల మాంసం
- కుళ్లిన మాంసాన్ని కెమికల్స్‌తో తాజాగా మార్చి విక్రయం
- మంగళ్‌హాట్ కేంద్రంగా దందా
- గోల్కొండ జోన్ టాస్క్‌ఫోర్స్, హెచ్‌ఫాస్ట్, జీహెచ్ఎంసీ టీం సంయుక్తంగా మెరుపు దాడులు
- ఇతర రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు చనిపోయిన మేకలు, గొర్రెల కొనుగోలు
- ప్రధాన నిందితుడితో సహా నలుగురు అరెస్టు



## కాంగ్రెస్ ప్రిన్స్‌కు వందోసారి కూడా ఓటమి ఖాయం

- అస్సాంలో గత పదేళ్లుగా గణనీయమైన అభివృద్ధి
- బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేను మరోసారి ప్రజలు ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారు
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

2 లో..

# ఎల్డీఎఫ్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్లే..

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీ, ఆర్ఎస్ఎస్సు కేరళలోకి రానీయకుండా లక్ష్మణ రేఖ గిసింది యూడీఎఫ్ అన్నారు. కేరళలో జాతీయ రహదారులు సహా పలు అభివృద్ధి పనులు నిలిచిపోయినా సీఎం పినరయి విజయన్ ఎందుకు నోరు మెదపట్లేదని ప్రశ్నించారు. కేరళ ప్రజలు బీజేపీ, ఎల్డీఎఫ్‌కు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. బీజేపీ, సీపీఎంల మధ్య రహస్య అవగాహన ఉందని, అందుకే సీపీఎం వాళ్లపై ఎటువంటి కేసులూ ఉండవని ఆరోపించారు. దేశంలోని ప్రతిపక్ష నేతలను ఈడీ, సీబీఐలతో వేధించే బీజేపీ ప్రభుత్వం.. విజయన్ సర్కారుపై మాత్రం ఈగ వాలనీయట్లేదన్నారు. బీజేపీ, ఎల్‌డీఎఫ్ బయటకు పోటీ పడుతున్నట్టు కనిపించినా, అది ఉత్తుత్తి పోటీనేనన్నారు. కేరళ సమగ్రాభివృద్ధి యూడీఎఫ్ లక్ష్యమన్నారు. విద్యావంతులైన ఎందరో మలయాళీలు స్థానికంగా ఉపాధి అవకాశాలు లేక విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారని.. వారికి స్థానికంగా ఉపాధి కల్పించే పరిశ్రమలు లేవని అన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో పాటు కేరళ సమగ్రాభివృద్ధికి యూడీఎఫ్ ప్రణాళికలు రచిస్తోందని సీఎం రేవంత్ తెలిపారు. హస్తం పార్టీకి ఓటేస్తే పాత కేరళం ఏమిటో మళ్లీ చూపిస్తామని హామీ ఇచ్చారు. డెవలప్‌మెంట్ విత్ డిగ్నిటీతో ముందుకు వెళుతున్నామని సీఎం తెలిపారు. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

### మోహన్‌లాల్ డైలాగ్‌లతో విజయన్‌కు సెటైర్లు

మోహన్‌లాల్ బ్లాక్ బస్టర్ సినిమా నరసింహంలో బహుళ ప్రాచుర్యం పొందిన ఓ డైలాగ్‌ను కేరళ సీఎం పినరయి విజయన్‌కు అన్వయించి ఎన్నికలో ప్రచారంలో చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి కార్యకర్తలను ఆకట్టుకున్నారు. ఆ సినిమాలో నీ 'పో మోనె దినేషా' అంటూ మోహన్‌లాల్ ఓ డైలాగ్ చెబుతారు. దానిని విజయన్‌కు అన్వయించిన సీఎం రేవంత్‌రెడ్డి.. '' నీ పో మోనె విజయా..! యువర్ టైమ్ ఈజ్ ఓవర్! యువర్ ఎక్స్‌పైరీ డేట్ ఈజ్ ఓవర్. యు డోంట్ హావ్ ఎనీ టైం టు కంటిన్యూ'' అంటూ డైలాగ్ పేల్చారు. మోహన్‌లాల్ స్టైల్లో '' నీ సమయం.. ఎక్స్‌పైరీ డేటూ అయిపోయింది.. నువ్వు సీఎంగా కొనసాగడానికి ఇక సమయం లేదు. విజయన్.. ఇక నువ్వు దిగిపో'' అంటూ డైలాగ్ కొట్టడంతో కార్యకర్తల నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. యంగ్ అండ్ డైనమిక్ సీఎం అంటూ కార్యకర్తలు నినదించారు.

### తెలంగాణ నుంచి స్టార్ క్యాంపెయినర్లుగా వీళ్లే..

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రచారాన్ని విస్తృతం చేస్తోంది. మూడు రాష్ట్రాలకు సంబంధించి స్టార్ క్యాంపెయినర్ల జాబితాను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విడుదల చేశారు. ఒక్కొక్క రాష్ట్రానికి 40 మంది చొప్పున నియమించారు. కేరళ, పుదుచ్చేరి, అస్సాం, పుదుచ్చేరితో పాటు గోవాలోని పోండా ఉప ఎన్నికల స్టార్ క్యాంపెయినర్‌గా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరించనున్నారు. మరోవైపు పుదుచ్చేరి స్టార్ క్యాంపెయినర్లుగా తెలంగాణ డిప్యూటీ సీఎం, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నియమితులయ్యారు.

# హైదరాబాద్‌లో 1,000 కిలోల కుళ్లిన మాంసం పట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

అంటే 10 వేల కేజీల కుళ్లినన మేక , గొర్రె మాంసాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జమ్మూ కశ్మీర్, మహారాష్ట్ర , ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి చనిపోయిన మేకలను, గొర్రెలను అఫ్రోజ్ అనే వ్యాపారి తక్కువ ధరకు నగరానికి తెప్పిస్తున్నట్లు విచారణలో తేలింది. అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో ఈ మాంసాన్ని నిల్వ చేస్తూ.. కెమికల్స్‌తో తాజాగా మార్చి నగరంలోని పలు హోటళ్లకు సరఫరా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కుళ్లిపోయి, బూజు పట్టిన స్థితిలో ఉన్న తలకాయలు, కాళ్లు చూసి అధికారులు షాక్‌కు గురయ్యారు.

హైదరాబాద్ మంగళహాట్ కేంద్రంగా సాగుతున్న ఈ దందాను గోల్కొండ జోన్ టాస్క్‌ఫోర్స్, హెచ్‌ఫాస్ట్, జీహెచ్ఎంసీ టీం సంయుక్తంగా నిర్వహించింది. 2 భారీ గోదాముల్లో నిల్వ ఉంచిన సుమారు 1000 కిలోల కుళ్లిపోయిన మేక, గొర్రె మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ దందా వెనక ఉన్న సూత్రధారి అఫ్రోజ్ అనీ, ఇతను జమ్మూకశ్మీర్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి చనిపోయిన మేకలు, గొర్రెలను తక్కువ ధరకు తెప్పిస్తున్నట్లు మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపారు. కనీసం స్టోరేజ్ లైసెన్స్ కూడా లేకుండా అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో ఈ మాంసాన్ని నిల్వ చేస్తూ డీప్ ఫ్రీజర్‌లో నిల్వ ఉంచి రసాయనాలతో తాజాగా మార్చి నగరంలో పలు శుభకార్యాలు, అనేక రెస్టారెంట్లు, బిర్యానీ హోటళ్లకు సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ జాయింట్ ఆపరేషన్‌లో భాగంగా ఇప్పటికే నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకోగా..కీలక నిందితుడు అఫ్రోజ్ ఇందులో ఉన్నాడు. గతనెల 12న అఫ్రోజ్‌కు సంబంధించిన ఏటూ జడ్ అండ్ గోట్ అఫల్స్ దుకాణంలో 300 కేజీ మేక, గొర్రెల విడిభాగాలు, పెద్ద ఎత్తున మాంసం నిల్వలు దొరికాయి. అప్పట్లో అఫ్రోజ్‌ను పోలీసులు అరెస్ట్ చేయగా, అతడు మళ్లీ బయటకు వచ్చి అదే దందా నడుపుతున్నట్లు పోలీసులు చెప్పారు.

### వ్యాపారస్తులతో సీపీ సమావేశం..

బుధవారం బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయంలో నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన వివిధ రకాల వ్యాపారస్తులతో సమావేశమయ్యారు. కల్తీపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్న నేపథ్యంలో ఇంత పెద్ద ఎత్తున కల్తీలు జరగడం వల్ల నగర ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతున్నదని, వెంటనే కల్తీ చేయడం ఆపేయాలని, కల్తీ వస్తువులు అమ్మకూడదని చెప్పారు. సమావేశానికి సుమారు 2వందల మంది హాజరుకాగా, కల్తీ లేకుండా వస్తువులు అమ్మాలని సూచించారు. ఒకవేళ ఎవరైనా కల్తీ చేసినట్లు సమాచారం వచ్చినా, వారి దగ్గర కల్తీ వస్తువులు అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ సజ్జనార్ హెచ్చరించారు.







# యుద్ధంలో చేరే ప్రసక్తే లేదు!

- యూకే ప్రధాని సర్ కీర్ స్టార్మర్

మా దేశ ప్రయోజనాలే మాకు ముఖ్యం.. ట్రంప్‌నకు స్పష్టం చేసిన బ్రిటన్

**లండన్:** ఇరాన్‌తో అమెరికా జరిపే యుద్ధంలో బ్రిటన్ చేరదని, అయితే వివిధ దేశాలతో అంతర్జాతీయ సదస్సును నిర్వహించి హార్ముజ్ జలసంధిని తిరిగి తెరిపించేందుకు ప్రయత్నిస్తామని యూకే ప్రధాని సర్ కీర్ స్టార్మర్ తెలిపారు. ఇరాన్‌తో యుద్ధంలో చేరడానికి యూరోపియన్ నాటో దేశాలు నిరాకరించడంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర విమర్శలు చేసిన క్రమంలో కీర్ స్టార్మర్ మాట్లాడుతూ 'నాపై, ఇతరులపై ఎంత ఒత్తిడి ఉన్నా, ఎన్ని విమర్శలు వచ్చినా, మా దేశ పౌరుల ప్రయోజనాలకు అనుగుణంగానే నేను నిర్ణయం తీసుకుంటాను. ఇది మా యుద్ధం కాదు. అందుకే ఇరాన్‌తో యుద్ధంలో చేరబోం' అని ఆయన స్పష్టం చేశారు. కాగా, ఇరాన్‌తో అమెరికా చేస్తున్న యుద్ధం పట్ల ఇప్పటికే పలు దేశాలు అనాసక్తితో ఉన్నాయి. అమెరికా జెట్ విమానాలు తమ వైమానిక స్థావరాలను వినియోగించుకోవడానికి ఇప్పటికే నాటో దేశాలైన ఇటలీ, స్పెయిన్ నిరాకరించాయి.






# మార్జిన్ పెంచేవరకు సమ్మె

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 1: రాష్ట్రంలో రిటైల్ చికెన్ షాపుల యజమానులకు పౌల్ట్రీ సంస్థలు మార్జిన్‌ను పెంచి న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర రిటైల్ చికెన్ షాప్స్ అసోసియేషన్ నేతలు జి. రాజు, వరుణ్‌యాదవ్ డిమాండ్ చేశారు. పౌల్ట్రీ కంపెనీలు మార్జిన్ పెంచేవరకు చికెన్‌షాపుల నిరవధిక బంద్‌ను కొనసాగిస్తామని హెచ్చరించారు. బుధవారం ఇందిరాపార్కు వద్ద అసోసియేషన్ ఆధ్వర్యంలో చికెన్ షాపుల యజమానులు ధర్నా నిర్వహించారు. హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన చికెన్ షాపుల యజమానులు ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొని పౌల్ట్రీ కంపెనీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నేతలు జి.రాజు, వరుణ్‌యాదవ్ మాట్లాడుతూ.. మార్జిన్ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకొని న్యాయం చేయాలని కోరారు. పౌల్ట్రీ సంస్థల యాజమాన్యాలు, ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. చికెన్ వ్యాపారులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, తెలంగాణ బీసీ పొలిటికల్ ఫ్రంట్ కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్‌లు మద్దతు ప్రకటించారు. ఇందిరా పార్కు ధర్నాలో వారు మాట్లాడుతూ.. పౌల్ట్రీ సంస్థలు లాభాల పెంచుకొనేందుకు రిటైల్ వ్యాపారులకు అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. మార్జిన్‌ను26 శాతం నుంచి 10 శాతానికి తగ్గించటం అన్యాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు లింగస్వామి, మహ్మద్ ఆయూబ్, రవిగౌడ్, సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. మార్జిన్ పెంచాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలో పలుచోట్ల చికెన్ షాపుల యజమానులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని అల్వాల్‌లో 140 చికెన్ షాపుల యజమానులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కేజీ చికెన్‌కు మార్జిన్‌ను రూ.40 ఇచ్చేవరకు సమ్మె కొనసాగిస్తామని అల్వాల్ చికెన్ షాప్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్. శ్రీనివ్‌సరెడ్డి ప్రకటించారు. కాగా, హైదరాబాద్‌లోని రెస్టారెంట్లు, హోటళ్లపై చికెన్ షాపుల బంద్ ప్రభావం పెద్దగా కనిపించలేదు. రాష్ట్రవ్యాప్తంగా సమ్మె పాక్షికంగానే కొనసాగింది. వేల సంఖ్యలో రిటైల్ చికెన్ సెంటర్లు ఉన్నా, వాటి నిర్వాహకులంతా బంద్‌లో పాల్గొనలేదని సమాచారం.

# ఆయిల్ పామ్ ధర రూ.1459 మేర పెంపు

(మొదటి పేజీ తరువాయి)

ఓ ప్రకటనలో తెలిపారు. ధరలు పెరగడం.. రైతుల్లో నమ్మకాన్ని పెంచుతుందని, భవిష్యత్తులో మరింత మంది రైతులు ఆయిల్ పామ్ సాగు వైపు మళ్లే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. కాగా, కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీ నమోదులో దేశంలోనే తెలంగాణ ముందుందని, మూడు నెలల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. రైతుల సమగ్ర డేటా ద్వారా ప్రభుత్వ పథకాల అమలు మరింత పారదర్శకంగా జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర కోటా మేరకు యూరియా సరఫరా చేయాలని కేంద్ర మంత్రిని కోరారు.

## కాంగ్రెస్ ప్రిన్స్‌కు వందోసారి కూడా ఓటమి ఖాయం: మోదీ

- అస్సాంలో గత పదేళ్లుగా గణనీయమైన అభివృద్ధి
- బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేను మరోసారి ప్రజలు ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారు
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

**గువాహటి:** అస్సాం గత పదేళ్లుగా గణనీయమైన అభివృద్ధిని సాధించిందని, బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేను మరోసారి రాష్ట్ర ప్రజలు ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారనే నమ్మకం తనకు ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. గోగముఖ్‌లో బుధవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచారసభలో ప్రధాని మాట్లాడుతూ.. ప్రజల ఉత్సాహాన్ని చూస్తుంటే అభివృద్ధి, సుస్థిరతకే పట్టంకట్టనున్నట్టు చాలా స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఈసారి ఎన్నికలు వికసిత్ భారత్ నిర్మాణానికి జరుగుతున్న ఎన్నికలు. అస్సాంలో బీజేపీ హ్యాట్రిక్ విజయంతో తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది అని ప్రధాని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి హ్యాట్రిక్ పరాజయం, ఆ పార్టీ యువరాజు రాహుల్‌కు వందోసారి ఓటమి ఖాయమని చెప్పారు. మూడోసారి ప్రధానిగా తాను హ్యాట్రిక్ సాధించానని, అస్సాంలో బీజేపీని కూడా హ్యాట్రిక్ విజయంతో ప్రజలు ఆశీర్వదిస్తారనే గట్టి నమ్మకంతో ఉన్నానని పేర్కొన్నారు. బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోను మోదీ ప్రస్తావిస్తూ, ప్రధాన మంత్రి ఆవాస్ యోజనతో అస్సాంలోని 15 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతాయని, ఇంతవరకూ ఇళ్లు రాని ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు ఇచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. పేద కుటుంబాలను కేజీ నుంచి పీజీ వరకూ ఉచిత విద్య కల్పిస్తామన్నారు. ఆదివాసీల హక్కులను కాపాడాతామని, ఉమ్మడి పౌర స్మృతి అమలు చేస్తామని పేర్కొన్నారు. 126 మంది సభ్యుల అస్సాం అసెంబ్లీకి ఏప్రిల్ 9న ఒకే విడతలో ఎన్నికలు జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

## కన్నవారితో రాజీకి ప్రయత్నించండి

(మొదటి పేజీ తరువాయి)

విచారించారు. పిటిషనర్ సంక్షేమాన్ని కుమారుడు పట్టించుకోలేదని, ప్రస్తుతం కుమార్తె వద్ద పిటిషనర్ ఉంటున్నారని న్యాయవాది వివరించారు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలి తం దక్కలేదని తెలిపారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. తమ సంరక్షణను పిల్లలు పట్టించుకోవడం లేదంటూ తల్లిదండ్రులు కోర్టులకు వస్తున్న కేసులు పెరు గుతున్నాయని తెలిపింది. ఈ కేసులో కుమారుడు పట్టించు కోవడంలేదని చెప్తున్నారని, కుమార్తె ఒకరే ఉంటే వారికీ తల్లిదండ్రులను చూడాల్సిన బాధ్యత ఉన్నదని చెప్పింది. ప్రత్యామ్నాయ మార్గాలైన రాజీ, చర్చలు లేకుండా నేరుగా పిల్లల నుంచి ఆస్తి ఇప్పించాలన్న పిటిషన్ల సంఖ్య పెరిగిందని వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్‌పై వివరాలు సమర్పించాలని సూర్యాపేట అధికారులకు ఆదేశించింది. విచారణను ఈనెల 15కి వాయిదా వేసింది.

## మీ సేవా చార్జీల భారీ పెంపు

(మొదటి పేజీ తరువాయి)

జనన, మరణ ధ్రువీకరణ, భూభారతి ఈ-కేవైసీ, కొత్త విద్యుత్తు కనెక్షన్ దరఖాస్తు వంటి సేవలున్నాయి. అలాగే ప్రింట్ల విషయానికొస్తే.. మొదటి నాలుగు పేజీల తర్వాత ఇచ్చే ప్రతి పేజీకి వసూలు చేసే స్కానింగ్, ప్రింటింగ్ చార్జీలు కూడా పెంచారు. ఇప్పటివరకు రూ.2 ఉండగా.. దాన్ని 2.50కి పెంచారు. విద్యుత్తు బిల్లుల చెల్లింపుల విషయంలో కూడా పెంపు అమలులోకి వచ్చింది. కరెంటు బిల్లు రూ.200 వరకు ఉంటే రూ.4కి పెంచగా.. అంతకంటే ఎక్కువ మొత్తాలపై రూ.9 నుంచి 44 వరకు చెల్లించే బిల్లును బట్టి వసూలు చేయనున్నారు. ఇక చివరిసారిగా మీసేవ సేవల చార్జీలను 15 ఏళ్ల క్రితం సవరించారు. ఇప్పటివరకు అన్ని సేవలకు 18 శాతం జీఎస్టీని మీసేవ నిర్వాహకులే చెల్లిస్తున్నారు. ఈ అంశంపై వారు అనేక సార్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. అలాగే నిర్వహణ ఖర్చు పెరిగిందని, కమీషన్‌ను పెంచాలని ప్రభుత్వాన్ని ఎప్పట్నుంచో కోరుతూ వస్తున్నారు. దీంతో ధరలు సవరించిన సర్కారు.. జీఎస్టీతో కలిపి మొత్తం చార్జీలను వినియోగదారులే చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. అలాగే ఈ సేవలకువసూలు చేసిన ఫీజులో 70 శాతం వరకు నిర్వాహకుల (వీఎల్ఈ) వాటాగా కేటాయిస్తున్నట్లు స్పష్టం చేసింది. చార్జీల పెంపుపై తెలంగాణ మీసేవ ఫెడరేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బైర శంకర్, అబ్దుల్ మోయిద్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ధన్యవాదాలు తెలిపారు.

## 'స్మార్ట్'గా భూ రెవెన్యూ 'సర్వే'

(మొదటి పేజీ తరువాయి)

చేస్తామని వెల్లడించారు. ఈ పోర్టల్‌లో లాగిన్ అయిన వెంటనే రైతు తన భూ వివరాలు తెలుస్తాయి. అన్నదాత తనకు గల భూమి సర్వే కోరితే.. ఎకరాల వారీగా ఎంత ఫీజు చెల్లించాలో స్క్రీన్ (తెర)పై కనిపిస్తుంది. సర్వే ఫీజు చెల్లించగానే.. సంబంధిత గ్రామ సర్వేయర్ లాగిన్‌లోకి ఆ వివరాలు వెళతాయి. అటుపై 2 రోజులకు సదరు భూమి సరిహద్దుల్లోని రైతులకు రెవెన్యూశాఖ నోటీసులు జారీ చేస్తుంది. తర్వాత ఏడు రోజుల్లో భూ సర్వే పూర్తి చేస్తారని మంత్రి పొంగులేటి వెల్లడించారు. అటుపై మండల సర్వేయర్ లాగిన్‌కు వెళ్లిన సర్వే వివరాలు.. ఆయన పరిశీలన తర్వాత తహసీల్దార్ ఆమోదంతో రైతుకు సర్వే మ్యాప్, భూధార్ నంబరు కేటాయిస్తారని స్పష్టం చేశారు. ఈ వివరాలన్నీ పోర్టల్‌లోనూ నమోదు చేస్తారు. దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి ప్రక్రియ ముగిసేవరకు ప్రతి దశలో పురోగతిని తెలుపుతూ దరఖాస్తుదారుని ఫోన్‌కు మెసేజ్ వెళుతుంది.

### 5 మండలాల్లో ప్రతి సర్వే నంబరుకు మ్యాప్

ప్రయోగాత్మకంగా సమీకృత భూభారతి పోర్టల్‌ను అమలు చేస్తున్న 5 మండలాల్లో ప్రతి సర్వే నంబరుకు సర్వే మ్యాప్ ఇస్తామని పొంగులేటి అన్నారు. పాత విధానాలకు స్వస్తి పలికి.. ఆధునిక సాంకేతికతతో నిర్వహించడంవల్ల త్వరితగతిన భూముల సర్వే పూర్తవుతుందన్నారు. రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా సమీకృత భూభారతి పోర్టల్.. రెవెన్యూ వ్యవస్థలో చారిత్రక మార్పునకు నాంది పలుకుతుందని తెలిపారు.

## 'కమర్షియల్'పై మళ్లీ బాదుడు

(మొదటి పేజీ తరువాయి)

కిలో లీటరుకు రూ.2.07 లక్షలకు చేరుకుంది. అయితే, ఇది అంతర్జాతీయ విమాన సర్వీసులకే వర్తిస్తుంది. దేశీయ సర్వీసులకు ఇంధనం ధర పెంపును 8.5 శాతానికే పరిమితం చేశారు. వాటికి కిలోలీటరు ఇంధనం ధర రూ.1,04,927కి పెరిగింది. ఇక సాధారణ పెట్రోల్, డీజిల్, గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధరల్లో ఎటువంటి మార్పులు లేవు. పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో.. సహజవాయువు దిగుమతులపై నీలినీడలు కమ్ముకున్నాయి. దీంతో మార్చి 1వ తేదీన వాణిజ్య సిలిండర్ ధరను రూ.114 మేర పెంచారు. మార్చి 7న 14.2 కిలోల గృహవినియోగ సిలిండర్ ధరను రూ.60 మేర పెంచిన విషయం తెలిసిందే. కాగా, విమాన ఇంధనం ధర పెంపుతో దేశీయ, అంతర్జాతీయ సర్వీసుల మీద అదనపు ఇంధన రుసుం వసూలు చేయనున్నామని, ఇది కనిష్ఠంగా రూ.250 నుంచి గరిష్ఠంగా రూ.10 వేల వరకు ఉంటుందని ఇండిగో సంస్థ ప్రకటించింది. విమాన టికెట్ల ధరలు ఈ మేరకు పెరగనున్నాయి.

# శాస్త్రిపురంలో హైడ్రా 'ఆపరేషన్'

## పార్క్ స్థలంలో అక్రమ కట్టడాల కూల్చివేత

## సుమారు 6500 గజాల కబ్జా స్థలంలో భారీ భవనాలు నేలమట్టం





మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 01 ( వార్త వేదిక సూర్య ) :
రంగారెడ్డి జిల్లా పరిధిలోని శాస్త్రిపురం కాలనీలో అక్రమ కట్టడాలనే లక్ష్యంగా హైడ్రా అధికారులు మరో భారీ ఆపరేషన్ చేపట్టారు. కాలనీలోని పార్క్ స్థలాన్ని కబ్జా చేసి నిర్మించిన బహుళ అంతస్తుల భవనాలను బుధవారం భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేశారు. శాస్త్రిపురం కాలనీలోని సర్వే నెంబర్ 134/20లో సుమారు 6500 గజాల విస్తీర్ణంలో ఉన్న పార్క్ స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించినట్లు హైడ్రాకు ఫిర్యాదులు అందాయి. ఈ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా భారీ భవన నిర్మాణాలు చేపట్టినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ప్రజా అవసరాల కోసం కేటాయించిన పార్క్ స్థలాన్ని కబ్జా చేయడాన్ని తీవ్రంగా పరిగణించిన అధికారులు, క్షేత్రస్థాయిలో చర్యలకు దిగారు. బుధవారం ఉదయం నుండే హైడ్రా అధికారులు, పోలీసులు పెద్ద సంఖ్యలో శాస్త్రిపురం చేరుకున్నారు. స్థానికంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. సుమారు నాలుగు నుండి ఐదు అంతస్తుల వరకు నిర్మించిన అక్రమ భవనాలను జేసీబీలు, క్రేన్ల సహాయంతో కూల్చి వేశారు. భవనాలను పూర్తిగా నేలమట్టం చేసే వరకు ఆపరేషన్ కొనసాగిస్తామని అధికారులు స్పష్టం చేశారు. హైడ్రా చేపట్టిన ఈ ఆకస్మిక చర్యతో కాలనీలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. భవన యజమానులు, స్థానికులు అధికారుల చర్యను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ స్థలాలను, పార్కులను కబ్జా చేస్తే ఎంతటి వారినైనా వదిలేది లేదని, ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని అధికారులు హెచ్చరించారు.



## బుద్వేల్ చర్చి స్థల వివాదం: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు వినతి

### - సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేత

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 01 ( వార్త వేదిక సూర్య ) :
రాజేంద్రనగర్ నియోజకవర్గం అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ గ్రామంలో చర్చి స్థలానికి సంబంధించి నెలకొన్న వివాదంపై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కి వినతిపత్రం సమర్పించారు. బుద్వేల్ గ్రామంలోని చర్చి స్థలాన్ని వ్యవసాయ విశ్వవిద్యాలయం తమ ఆధీనంలోకి తీసుకుని, అక్కడ పహారీ గోడ నిర్మాణంతో పాటు గేటును ఏర్పాటు చేస్తోందని స్థానిక నాయకులు స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. విశ్వవిద్యాలయం చేపడుతున్న ఈ నిర్మాణ పనుల వల్ల స్థానికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ విషయంలో వెంటనే జోక్యం చేసుకుని తగిన పరిష్కారం చూపాలని వారు కోరారు. చర్చి స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలను స్పీకర్‌కు వివరించి, న్యాయం చేయాలని విన్నవించారు. స్పీకర్‌ను కలిసిన వారిలో స్థానిక నాయకులతో పాటు జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు మరియు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పర్యవేక్షించిన మాజీ కార్పొరేటర్

### - కొంతం దీపిక నరేష్

సికింద్రాబాద్, ఏప్రిల్ 01(వార్త వేదిక సూర్య)



మోండా మార్కెట్ డివిజన్ కుమ్మరిగూడ లోని జరుగుతున్న సిసి రోడ్ పనులను బుధవారం మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్ వివిధ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ... స్థానికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు అదేవిధంగా పనుల్లో నాణ్యతమైన విషయంలో రాజిపడకూడదాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు జితూగుప్తా, ప్రశాంత్ జైన్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజల సమస్యలను పరిష్కరించడమే నా లక్ష్యం

### మాజీ కార్పొరేటర్ - కొంతం దీపిక నరేష్

సికింద్రాబాద్, ఏప్రిల్ 01(వార్త వేదిక సూర్య)



ప్రజల సమస్యలను పరిష్కరించడమే తమ లక్ష్యమని మోండా మార్కెట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్ అన్నారు. డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ మరియు టీచర్స్ కాలనీ ప్రాంతాలలో గత కొన్ని రోజులుగా మురుగునీటి పొంగుతున్న నేపథ్యంలో వెంటనే ఈ విషయం తెలుసుకున్న మాజీ కార్పొరేటర్ బుధవారం ఎవీబొూదీ అధికారులతో కలిసి తాత్కాలింగా సమస్యను పరిష్కరించారు. అనంతరం ఆమెకు అక్కడ ఉన్న బస్తీ వాసులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు ఉన్నారు

## శ్రీరామ కాలనీలో చలివేంద్రం ప్రారంభించిన దూడల సుధాకర్ గౌడ్

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 01 ( వార్త వేదిక సూర్య ) :



వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు శ్రీరామ కాలనీ ప్రభుత్వ పాఠశాల సమీపంలో చలివేంద్రాన్ని దూడల సుధాకర్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో చలివేంద్రాలు ఎంతో అవసరమని, దాహం తీర్చడం మహత్తరమైన సేవ అని పేర్కొన్నారు. నీరు అందించడం ద్వారా ప్రాణాలను కాపాడినట్లేనని ఆయన అన్నారు. సామాజిక సేవలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీకాంత్ గౌడ్, జీతూ, శ్రీను తదితరులు పాల్గొన్నారు

# ఆహారపు అలవాట్లు, వ్యాయామంతోనే దీర్ఘకాలిక వ్యాధులకు చెక్



## జిమ్స్ హాస్పిటల్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సురేఖ రావు

## బుద్వేల్‌లో ఘనంగా ఉచిత హోమియోపతి వైద్య శిబిరం

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 01 ( వార్త వేదిక సూర్య ) :

నేటి ఆధునిక జీవనశైలిలో పెను సవాళ్లుగా మారిన మధుమేహం, రక్తపోటు, ఊబకాయం వంటి సమస్యలను కేవలం ఆహారపు అలవాట్ల మార్పు, రోజువారీ వ్యాయామంతోనే జయించవచ్చని జిమ్స్ హోమియోపతి మెడికల్ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సురేఖ రావు పేర్కొన్నారు. హోమియోపతి దినోత్సవ వారోత్సవాల సందర్భంగా ముచింతల్ జిమ్స్ హోమియోపతి మెడికల్ కాలేజ్ ఛ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం బుద్వేల్‌లోని అరుంధతి వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత హోమియోపతి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 60 మందికి పైగా స్థానికులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేఖ రావు మాట్లాడుతూ.. ఉప్పు, చక్కెర వినియోగాన్ని తగ్గించి, ఆకుకూరలు మరియు పోషకాహారాన్ని భాగం చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ వ్యాయామం చేయడం వల్ల శరీర బరువును నియంత్రించడమే కాకుండా, దీర్ఘకాలిక వ్యాధుల నుండి ఉపశమనం పొందవచ్చు. ప్రజలు హోమియోపతి వైద్యంపై విశ్వాసం పెంచుకోవాలి అని ఆమె కోరారు. డాక్టర్ సురేఖ రావు ఆధ్వర్యంలో పీజీ స్కాలర్స్, బీహెచ్ఎంఎస్ విద్యార్థుల బృందం రోగులకు ఎత్తు, బరువు, షుగర్ మరియు బీపీ పరీక్షలు చేసి తగు సలహాలు అందించారు. ప్రతి బుధవారం బుద్వేల్ కమ్యూనిటీ హాల్‌లో ఈ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.



## లేబర్ కోడ్ లు రద్దు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలి : సిఐటియు

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 1 (వార్తా వేదిక సూర్య )





కేంద్ర ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న. 29 చట్టాలను రద్దుచేసి. తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి సలీం, ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య, సహాయ కార్యదర్శి అవుట రవీందర్ లు డిమాండ్ చేశారు. బుధవారం కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలో మున్సిపల్ హాజరు పాయింట్ల దగ్గర, హమాలీ , పవర్లూమ్, భవన నిర్మాణ రంగా కార్మికుల పని ప్రదేశాలలో పలుచోట్ల 4 లేబర్ కోడ్ల అమలును నిరసిస్తూ బ్లాక్ డే, నిరసనలు, చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ. కార్మిక చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్ లు తెచ్చిందని ఆరోపించారు. వాటిని వెంటనే రద్దుచేసి. పాత చట్టాలను యధాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేరళ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్స్ ను అమలు చేయమని. అసెంబ్లీలో తీర్మానం చేసిందని. అదే తరహాలో తెలంగాణ రాష్ట్రం లో కూడ అమలు చేయమని. అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ బిల్లు 2022 ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షం లో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంలో కార్మిక వర్గం అంతా ఐక్యంగా సిద్ధపడి ఉన్నారని హెచ్చరించారు. పట్టణంలో పలుచోట్ల జరిగిన నిరసన కార్యక్రమంలో పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు గంజి నాగరాజు,హమాలి యూనియన్ కార్యదర్శి బొమ్మకంటి లక్ష్మీపతి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి పెరిక కృష్ణ, పందుల లింగయ్య,జీడిమెట్ల నరసింహ,దర్శనం ఎల్లమ్మ, నాగుల కరుణ, వీరబాబు, అంజయ్య, ముషంగిరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మణికొండలో 'అంతిమ' కష్టాలు




## 3 వేల నాటి వసతులే.. 3 లక్షల జనాభాకు దిక్కు!

## వైకుంఠ రథం ఒక్కటే.. చితులు రెండే!

## బి.ఆర్.ఎస్ నాయకుల పర్యటనలో వెల్లడైన చేదు నిజాలు

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 01 ( వార్త వేదిక సూర్య ) :
మణికొండ మున్సిపల్ పరిధిలో జనాభా గణనీయంగా పెరిగినా, దానికి అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించడంలో పాలకులు, అధికారులు విఫలమ య్యారని భారత రాష్ట్ర సమితి (బి.ఆర్.ఎస్) నాయకులు విమర్శించారు. 'ప్రజలతో - ప్రజల కొరకు' కార్యక్రమంలో భాగంగా బుధవారం మర్రిచెట్టు సమీపంలోని శ్మశాన వాటికను సందర్శించి, స్థానికులతో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మణికొండ జాగీరులో కేవలం 3 వేల జనాభా ఉన్నప్పుడు ఏర్పాటు చేసిన వసతులే నేటికీ కొనసాగుతున్నాయని మండిపడ్డారు. ప్రస్తుతం జనాభా 3 లక్షలకు చేరినప్పటికీ, దహన సంస్కారాల కోసం కేవలం రెండు చితులు మాత్రమే ఉండటం శోచనీయమన్నారు. అలాగే, ఏళ్ల క్రితం కేటాయించిన ఒకే ఒక వైకుంఠ యాత్ర వాహనం నేటికీ చలామణిలో ఉందని, అది ఏమాత్రం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మణికొండ జాగీరులో కేవలం 3 వేల జనాభా ఉన్నప్పుడు ఏర్పాటు చేసిన వసతులే నేటికీ కొనసాగుతున్నాయని మండిపడ్డారు. ప్రస్తుతం జనాభా 3 లక్షలకు చేరినప్పటికీ, దహన సంస్కారాల కోసం కేవలం రెండు చితులు మాత్రమే ఉండటం శోచనీయమన్నారు. అలాగే, ఏళ్ల క్రితం కేటాయించిన ఒకే ఒక వైకుంఠ యాత్ర వాహనం నేటికీ చలామణిలో ఉందని, అది ఏమాత్రం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సదుపాయాలు లేక స్థానికులు అంత్యక్రియల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, దీనివల్ల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు.

# శాలిగౌరారం మండలంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన





## ప్రభుత్వ సంస్థల తనిఖీ.

## ప్రభుత్వ పథకాల అమలుపై క్షేత్రస్థాయిలో సిబ్బందికి సూచనలు.

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 1 (వార్తా వేదిక సూర్య )

ఉపాధి హామీ పనులు చేసే చోట కూలీలకు నీడతోపాటు, తాగునీరు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిని ఆదేశించారు. వన మహోత్సవం కింద రానున్న వర్షాకాలంలో మొక్కలు నాటేందుకుగాను అన్ని గ్రామాలలో మొక్కలు నాటే స్థలాలను గుర్తించాలని, నర్సరీలలో పెంచుతున్న మొక్కల గురించి గ్రామసభలలో ప్రజలకు తెలియజేసి వారి అభిప్రాయాలను తీసుకోవాలని సూచించారు.

బుధవారం జిల్లా కలెక్టర్ నల్గొండ జిల్లా, శాలిగౌరారం మండలం, వల్లాల, అడ్లూరు గ్రామాలలో పర్యటించి పలు ప్రభుత్వ సంస్థలను,ప్రభుత్వ పనులను తనిఖీ చేశారు. ముందుగా వల్లాల గ్రామంలో గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పెంచుతున్న వనమహోత్సవం నర్సరీని తనిఖీ చేశారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలు,వాటి రకాలు, గ్రామపంచాయతీ ద్వారా వాన కాలంలో నాటనున్న మొక్కల టార్గెట్, మొక్కలు నాటే స్థలాల గుర్తింపు, గృహాలకు పంపిణీ చేసే మొక్కలు, జియో ట్యాగింగ్ తదితర వివరాలన్నింటిని ఏపీఎం శంకరయ్య ,ఏపీవో జంగమ్మ, వన సేవకుడు తంబయ్య ద్వారా అడిగి తెలుసుకున్నారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలకు ఎప్పటికప్పుడు నీరు పోస్తూ సంరక్షించాలని, నర్సరీలో పెంచుతున్న మొక్కల విషయాలను గ్రామసభలో గ్రామస్తులకు చదివి వినిపించి వారి అభిప్రాయం సేకరించి గ్రామానికి అవసరమైన మొక్కలను పెంచేందుకు ప్రణాళిక రూపొందించాలని, వానకాలంలో నాటనున్న మొక్కలకు ముందే స్థలాలను గుర్తించి ప్రణాళిక రూపొందించాలని, గ్రామానికి నిర్దేశించిన 13800 మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం పక్కనే ఉన్న పల్లె ప్రకృతి వనాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేసి గ్రామస్తుల ఉదయం నడకకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం వల్లాల గ్రామ చెరువులో ఉపాధి హామీ పథకం కింద కూలీలు ఫిష్ పాండ్ తవ్వుతుండగా తనిఖీ చేశారు. కాగా ఉపాధి హామీ పథకం కింద 6 లక్షల రూపాయల అంచనా వ్యయంతో 3000 పని దినాలు కల్పించేందుకు ఫిష్ పాండ్ పనులు చేపట్టగా, కూలీలతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎంతమంది వస్తున్నారని? పని ఎప్పుడు ప్రారంభించారని? మెజర్మెంట్ ఎంత తీసుకున్నారని? అడిగారు. ఎండలకు పనిచేయలేకపోతున్నామని కూలీలు జిల్లా కలెక్టర్ కు తెలుపగా ఉదయం వచ్చి పని చేసుకోవాలని, తక్కువ పని చేస్తే తక్కువ వేతనం వస్తుందని, అలా కాకుండా ఎక్కువ పనులు చేసుకున్నప్పుడు ఎక్కువ వేతనం వచ్చేలా చూడాలని ఫిష్ పాండ్ తో పాటు, ఫీడర్ ఛానల్ ,ఇతర పనులు చేసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మస్టర్, ఇతర రిజిస్టర్లను పరిశీలించారు. ఉపాధి హామీ పనులు చేసే చోట కూలీలకు నీడతోపాటు, తాగునీటిని కల్పించాలని డిఆర్డిఓ శేఖర్ రెడ్డిని ఆదేశించారు. ఆ తర్వాత జిల్లా కలెక్టర్ గ్రామంలో కట్టగూరు సుధారాణి అనే లబ్ధిదారు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీని సందర్శించి ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక లో భాగంగా గురువారం నిర్వహించనున్న గ్రామ సభకు సంబంధించి సర్పంచి తిరుపతమ్మ, పంచాయతీ కార్యదర్శి, ఇతర అధికారులతో చర్చించారు. గ్రామసభకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, గ్రామ అధికారులు అందరికీ తెలియజేయాలని, అదేవిధంగా సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు అందర్నీ గ్రామసభకు ఆహ్వానించాలని, మినిట్స్ రికార్డు చేయాలని ,గ్రామ సభలో ఏమైనా గ్రామ సమస్యలు ఉన్నట్లయితే చర్చించాలని తెలిపారు.

కాగా గ్రామానికి సంబంధించి పాఠశాల సమస్యను, విద్యుత్ సమస్యను, పాత బిల్లుల విషయాన్ని సర్పంచ్ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ గ్రామంలో ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్ ను సందర్శించి యోగ తరగతి గదిని తనిఖీ చేశారు. పాఠశాలలోని తాగునీటి ఆరో ప్లాంట్ పనిచేయడం లేదని తెలుసుకొని తక్షణమే మరమ్మతులు చేయించాలని, పిఎంసి బోర్డు ఏర్పాటు చేయాలని, డ్యూయల్ డేస్కులను తక్షణమే ఫిట్ చేయించాలని ప్రిన్సిపల్ కృష్ణమోహన్ ను ఆదేశించారు. అనంతరం వంటగదిని, డైనింగ్ ను పరిశీలించి కట్టెలపై వంట వండుతుండడాన్ని గమనించిన జిల్లా కలెక్టర్ తక్షణమే కట్టెల ద్వారా వండడాన్ని నిలిపివేసి గ్యాస్ పై వండాలని వంట మనుషులను, పాఠశాల ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. తెలంగాణ మోడల్ స్కూల్ పిఎం శ్రీ కింద చేపట్టినందున మోడల్ స్కూల్ గా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని కలెక్టర్ ఆదేశించారు. ఆ తర్వాత జిల్లా కలెక్టర్ ఇదే మండలంలోని అడ్లూరు గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి కేంద్రంలో ఉన్న పిల్లలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, శామ్,మామ్ పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాన్ని ప్రైవేటు భవనంలో నిర్మిస్తుండగా



ప్రభుత్వము ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా అంగన్వాడి కేంద్రం మంజూరు చేసిందని తెలుసుకొని తక్షణమే పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలతో మాట్లాడుతూ.. అంగన్వాడి కేంద్రం ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పారు. కేంద్రంలోని స్టాక్ రిజిస్టర్ లను, గుడ్లు, బియ్యం, ఆయిల్ తదితర వంట సరుకులను తనిఖీ చేశారు. అనంతరం ఇదే గ్రామంలో నిర్మాణంలో ఉన్న గ్రామ సమాఖ్య భవనాలను తనిఖీ చేశారు. గతంలో గ్రామానికి 50 డబుల్ బెడ్ రూమ్ లు మంజూరు కాగా, 25 మాత్రమే పూర్తయ్యాయని, తక్కినవి ఆగిపోవడాన్ని సర్పంచ్ లక్ష్మి ,వెంకట్ రెడ్డి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే మిషన్ భగీరథ నీరు సగం గ్రామానికి వస్తున్నదని, సమస్యను పరిష్కరించాలని కోరారు. గ్రామ సమాఖ్య భవనానికి ఎస్ బి ఎం లో టాయిలెట్లు మంజూరు చేయాలని డిఆర్డిఓ ను కలెక్టర్ ఆదేశించారు. ఎంపీడీవో జ్యోతిలక్ష్మి, తహసిల్దార్ వరప్రసాద్, వల్లాల పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్య, ఎంఈఓ సైదులు, తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కృష్ణమోహన్, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.



## జీజదీ వాహనాన్ని ప్రారంభించి శుభాకాంక్షలు

నల్గొండ టౌన్ ఏప్రిల్ 1 వార్త వేదిక సూర్య



కేతేపల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన లక్ష్మినారాయణ నూతనంగా కొనుగోలు చేసిన జీజదీ వాహనాన్ని ప్రారంభించి శుభాకాంక్షలు తెలియజేసి, రామ్మూర్తి గారు నూతనంగా కొనుగోలు చేసిన కారును ప్రారంభించి శుభాకాంక్షలు తెలియజేసిన లిబిప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం ..ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## అంబేద్కర్ విగ్రహం చుట్టూ ప్రహరీ పునర్నిర్మాణం

-సుందరీకరణ





దేవరకొండ ఏప్రిల్ 01 ( వార్తా వేదిక సూర్య):-

కొండమల్లేపల్లి తహసిల్దార్ ఆధ్వర్యంలో అంబేద్కర్ యువజన సంఘాలు, దళిత సంఘాలు, విద్యార్థి సంఘాలు కలిసి కొండమల్లపల్లి కూడలిలో గల అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఉన్న ప్రహరీ గోడ పునర్నిర్మాణం కోసం సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది. అన్ని సంఘాల వాళ్ళు ఏకాభిప్రాయానికి వచ్చి ఏప్రిల్ 14 2026 అంబేద్కర్ జయంతి వరకు విగ్రహం చుట్టూ 25 ఫీట్ల రేడియస్ లో పునర్ నిర్మించాలని ఏకగ్రీవంగా నిర్ణయించడం జరిగింది.

దీనికి సంబంధించి గౌరవ కొండమల్లేపల్లి మండల ఎమ్మార్వో , సీఐ ఎస్ ఐ ఎన్ హెచ్ ఎ ఐ డి ఈ సమావేశంలో పాల్గొని విగ్రహం చుట్టూ 25 ఫీట్ల రేడియస్ తో వెంటనే పనులు ప్రారంభించి ఏప్రిల్ 14 లోపు ప్రహరీ గోడను పునర్నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. పచ్చటి గడ్డి లైటింగ్ కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ సమన్వయ సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఏదుల ఎల్లయ్య మాదిగ, అంబేద్కర్ యువజన సంఘం కొండమల్లేపల్లి అధ్యక్షులు అందుకుల చెన్నకేశవులు, ఉపాధ్యక్షులు అందుల అనిల్,ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాదెపాకు జగదీష్ ఎం ఈ ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పులి కంటి భాస్కర్, పోతెం సహదేవులు, శ్రీను,ఎర్ర యాదగిరి, ప్రశాంత్ గుణశేఖర్ ,వాసు, సమతా సైనిక్ దళ్ ప్రసాద్, హరి, ఏకుల సురేష్, సతీష్, గ్యార యాదగిరి తదితరులు పాల్గొనడం జరిగింది.



## అప్పాజీపేట లో బ్లాక్ డే పాటిస్తూ కార్మికుల నిరసన

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 1 (వార్తా వేదిక సూర్య )

కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్ లను బుధవారం నుండి అమలు చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని నిరసిస్తూ. జాతీయ కార్మిక సంఘాల పిలుపుమేరకు. బ్లాక్ డే పాటిస్తూ, నల్గొండ మండలం అప్పాజీపేట గ్రామపంచాయతీ కార్యాలయం దగ్గర సిఐటియు మండల కన్వీనర్ పోలే సత్యనారాయణ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు కాసర్ల వెంకన్న జాగటి మురళి,అంగన్వాడి, ఆశ, మధ్యాహ్న భోజనం, గ్రామీణ, హమాలి ట్రాన్స్పోర్ట్ కార్మికులు నిరసన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో పోలే నాగమణి రేణుక భీమయ్య సత్యనారాయణ మణెమ్మ ప్రేమయ్య నరసింహ,వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్స్ వెనక్కి తీసుకోవాలి




## - కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాల పై సమరశీల ఉద్యమాలు.

## - సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చిన్నపాక లక్ష్మీనారాయణ.

నాంపల్లి ఏప్రిల్ 01(వార్త వేదిక సూర్య)

నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం ఇటీవల తెచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ ను వెంటనే వెనక్కి తీసుకోవాలని లేకపోతే ప్రభుత్వంపై కార్మిక వర్గం సమస్యల పోరాటాలు చేస్తుందని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చిన్నపాక లక్ష్మినారాయణ హెచ్చరించారు.

బుధవారం సిఐటియు అఖిలభారత కమిటీ పిలుపు మేరకు లేబర్ కోడ్స్ ఈరోజు నుండి అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త పిలుపులో భాగంగా నాంపల్లి మండల కేంద్రంలో నల్ల బ్యానర్ తో నిరసన వ్యక్తం చేశారు. దేశ స్వాతంత్రానికి ముందు కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మికులకు వ్యతిరేకమైన యజమానులకు, కార్పొరేట్ కు అనుకూలమైన నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చి కార్మిక వర్గాన్ని ఆధునిక బానిసలుగా మార్చడానికి పెట్టుబడుదారులకు మరింత లాభాలు చేకూరడానికి కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని విమర్శించారు. కార్మిక హక్కులను కాలరాసే ఈ లేబర్ కోడ్స్ రద్దు చేసేంతవరకు దేశవ్యాప్తంగా కార్మిక వర్గ నైకేం చేసి పెద్ద ఎత్తున సమరసిల పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.కేంద్ర ప్రభుత్వం దేశంలో కార్మిక రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ 90% ప్రజల ప్రయోజనాలను కార్పొరేట్లకు తాకట్టు పెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ రద్దుచేసి వి బి జి రాంజీ స్కీమ్ గా మార్చడాన్ని దేశంలోని వ్యవసాయ కార్మికులు తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారని అన్నారు. రైతాంగం కు రైతు ఉద్యమ సందర్భంగా ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా రైతాంగాన్ని మోసం చేసిందని అన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి సామాన్య ప్రజలు పేదలు తీవ్రమైనటువంటి ఇబ్బందులు పడుతుంటే నరేంద్ర మోడీ ప్రభుత్వం దున్నపోతు మీద వాన పడ్డచందంగా వ్యవహరిస్తుందని అన్నారు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా తమ విధానాలు మార్చుకోకపోతే ప్రజా ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, సిఐటియు మండల కన్వీనర్ ఏదుళ్ళ సునీత, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు రేవెల్లి యాదయ్య, మరియమ్మ లలిత నీలిమ రాములమ్మ ఈరమ్మ పార్వతమ్మ సులోచన నాగమ్మ వెంకటయ్య రవితేజ తదితరులు పాల్గొన్నారు

# కార్మిక హక్కులపై కేంద్ర ప్రభుత్వ దాడి

## ...4 లేబర్ కోడ్లు వెంటనే రద్దు చేయాలి

## చట్టాల మార్పు కాదు ... కార్మిక హక్కుల అపహరన

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 1 (వార్తా వేదిక సూర్య )

కేంద్ర ప్రభుత్వం నేటి నుండి అమలు చేయబోతున్న నూతన 4 లేబర్ కోడ్లు, కార్మిక వర్గం పై తీవ్రమైన దాడి అని, ఇది చట్టాల మార్పు కాదు..కార్మిక హక్కుల అపహరణ అని, ఈ కోడ్లు కార్మికుల శ్రమను చౌకగా మార్చి, పెద్ద కార్పొరేట్ సంస్థల లాభాల కోసం రూపొందించిన దోపిడీ విధానాలు మాత్రమేనని, దీనిని వ్యతిరేకిస్తూ, జాతీయ పిలుపులో భాగంగా ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నల్లగొండ సుభాష్ విగ్రహం వద్ద "బ్లాక్ డే"గా పాటిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరా రెడ్డి, ఏ.ఐ.టీ.యూ.సి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు అంబటి సోమయ్య, ఐ.ఎఫ్.టి.యు జిల్లా అధ్యక్షులు బొల్గురి నరసింహ మాట్లాడుతూ.. కార్మిక హక్కులను రక్షించుకోవడం కోసం ప్రతి కార్మికుడు ఈ పోరాటంలో భాగస్వామి కావాలని పిలుపునిస్తున్నామన్నారు. పని గంటల పెంపు, శ్రమ దోపిడీ పెరుగుదల, కొత్త కోడ్ల ద్వారా పని గంటలను పెంచే అవకాశం ఉందన్నారు. ఇది కార్మికుల ఆరోగ్యం, జీవన నాణ్యతను దెబ్బతీస్తుందని, ఉద్యోగ భద్రత లేకపోవడం 300 మందికి లోపల ఉద్యోగులు ఉన్న సంస్థల్లో ప్రభుత్వం అనుమతి లేకుండా ఉద్యోగాలను తొలగించే స్వేచ్ఛ ఇవ్వడం ద్వారా ఉద్యోగ భద్రత పూర్తిగా నశిస్తుందన్నారు. యూనియన్ హక్కులపై పరిమితులు పెట్టారని.




కార్మిక సంఘాలను ఏర్పాటు చేయడం, సమ్మె చేయడం వంటి హక్కులను పరిమితం చేస్తూ కార్మికుల స్వరాన్ని అణచివేయడం జరుగుతోందన్నారు. కాంట్రాక్ట్ వ్యవస్థ పెరుగుదల,

పర్మినెంట్ ఉద్యోగాల స్థానంలో కాంట్రాక్ట్ ఉద్యోగాలను ప్రోత్సహించడం ద్వారా కార్మికులను అస్థిర జీవితానికి నెట్టివేస్తున్నారన్నారు. వేతనాలు, సంక్షేమంపై దెబ్బ

మినిమమ్ వేతనాలు, బోనస్, సామాజిక భద్రత వంటి అంశాలను బలహీనపరచి కార్మికుల హక్కులను తగ్గిస్తున్నారన్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వంను వెంటనే 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని, పాత కార్మిక చట్టాలను బలోపేతం చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత, గౌరవప్రద వేతనాలు కల్పించాలని, కాంట్రాక్ట్ వ్యవస్థను తగ్గించి. పర్మినెంట్ ఉద్యోగాలను పెంచాలి.

యూనియన్ హక్కులను పూర్తిగా రక్షించాలని డిమాండ్ చేస్తున్నదన్నారు. ఈ లేబర్ కోడ్లు కార్మికుల భవిష్యత్తు పై దాడి అని. ఇది కేవలం చట్టాల మార్పు కాదని, కార్మిక హక్కుల అపహరణ. కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా, కార్మిక హక్కుల రక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో సి.ఐ.టి.యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి సలీం,

ఐ. ఎన్.టి.యు.సి జిల్లా కార్యదర్శి సుంకిశాల వెంకన్న, ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి దొనకొండ వెంకన్న

ఐ.ఎఫ్.టి.యు జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మిడి నగేష్, సి.ఐ.టి.యు జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య, సహాయ కార్యదర్శి అవుట రవీందర్, వివిధ సంఘాల నాయకులు ఏం నందం, సంబి రెడ్డి,అనురాధ, యూసుఫ్, నాగరాజు, నరసింహ , సీతరాములు , శంకర్, ఇందూరి సాగర్, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఉడుత ఇందు పుట్టిన రోజు వేడుకలో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి, కేతావత్ బిల్యా నాయక్

దేవరకొండ ఏప్రిల్ 1 ( వార్త వేదిక సూర్య ):-

చింతపల్లి మండలం తీదేడు గ్రామానికి చెందిన ఉడుత హారిక యాదగిరి యాదవ్ కుమార్తె ఇందు పుట్టిన రోజు వేడుకలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి,కేతావత్ బిల్యా నాయక్ లు హాజరై చిన్నారిని ఆశీర్వాదించారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు సోనగంటి గొవర్ధనాచారి,బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉలుపాల శేఖర్ రెడ్డి,మర్రు రామారావు, ఉలుపాల పురుషోత్తం రెడ్డి, సిమర్ల శ్రీను యాదవ్,దాసరి తిరుపతయ్య,తిరుమణి పాపయ్య,దకాయితి బచ్చిరెడ్డి,మర్రు శ్రీనివాసరావు,శివర్ల పర్వతాలు,బొడ్డు యాదగిరి,మాదగోని కృష్ణ గౌడ్ రెడ్డి పరమేష్,గంటెల ఆంజనేయులు,మెరిక శంకరయ్య,ఉడుత శంకరయ్య, మంగ సత్తయ్య, జూలూరు శ్రీధర్, జెల్లా వెంకటేశ్వర్లు, శివర్ల అనిల్, ఉడుత శీను,సందె శంకర్,తదితరులు పాల్గొన్నారు

## క్రీడా విద్యార్థులను అభినందించిన కలెక్టర్ చంద్రశేఖర్

దేవరకొండ ఏప్రిల్ 1 ( వార్త వేదిక సూర్య ):-





నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం కొండమల్లేపల్లి మండల పరిధిలోని సోలిడార్ తెలంగాణ బదిరుల ఆశ్రమ పాఠశాల క్రీడా విద్యార్థులను నల్గొండ జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ అభినందించారు. ఇటీవల గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ లో ఆల్ ఇండియా స్పోర్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ది డెఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ క్రీడా పోటీలలో పాల్గొని 11 పథకాలు సాధించారు. వీరిలో ఇద్దరు గోల్డ్ మెడల్, ముగ్గురు విద్యార్థులు సిల్వర్ మెడల్, ఆరుగురు విద్యార్థులు కాంస్య మెడల్ ను సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు విద్యార్థులను కలెక్టర్ కార్యాలయానికి తీసుకెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులను సన్మానించి అభినందించారు. గెలుపుకు అంగవైకల్యం అడ్డు రాదని ఉన్నత ఆశయాలను ఎంచుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు దార్ల భాస్కర్, సురేష్, చంద్రయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు

## ఆత్మీయ బంధువులకు వీర హనుమాన్ విజయ యాత్ర శుభాకాంక్షలు

దేవరకొండ ఏప్రిల్ 1( వార్త వేదిక సూర్య ):-



దేవరకొండ పట్టణంలో గురువారం జరగబోయే వీర హనుమాన్ విజయ యాత్రను పురస్కరించుకొని నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలోని ఆత్మీయ హిందూ బంధువులందరికీ, భక్తజనులకు వడ్డెర సంఘం దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు ఇరగ దిండ్ల కృష్ణ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...భక్తి శ్రద్ధలతో నిర్వహించే ఈ విజయ యాత్ర సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని, ఐక్యతను పెంపొందించాలని ఆకాంక్షించారు. హనుమంతుని ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వారు కోరారు. ఈ యాత్రలో పాల్గొనే భక్తులందరికీ హనుమాన్ స్వామి రక్షణ కవచంలా ఉండి, యాత్ర దిగ్విజయంగా సాగాలని ప్రార్థించారు. భక్తిభావంతో జరిగే ఈ కార్యక్రమంలో హిందూ బంధువులందరూ భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.

# అర్హులైన లబ్ధిదారులకు విడుదలవారీగా ఇందిరమ్మ ఇండ్లు.

### దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

దేవరకొండ ఏప్రిల్ 1 ( వార్తా వేదిక సూర్య):-

దేవరకొండలి పట్టణంలోని ఎమ్మెల్యే నివాసం (వ్యవసాయ మార్కెట్ యార్డ్) లో హౌసింగ్ అధికారులతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించి,పెండింగ్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో చెల్లించాలని అధికారులను ఆదేశించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేస్తామని అన్నారు. పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. అర్హులైన లబ్ధిదారులకు విడుదలవారీగా రూ.5లక్షలు అందజేయడం జరుగుతుందని అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తుందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్దిదారులు ఎవరికి ఒక్క రూపాయి ఇవ్వద్దని, ఎవరైనా తీసుకుంటే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాలు లేవని, పదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ రాజ్ కుమార్, డి ఇ నాగేందర్ గౌడ్ ఏ ఇ లు వినోద్, విజయ్, కుమార్, లావణ్య, సందీప్ రెడ్డి, చింతపల్లి మండల పార్టీ అధ్యక్షులు నాగభూషణం,మాజీ ఎంపీపీ భవాని పవన్ కుమార్,సీనియర్ నాయకులు యుగేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# ఘనంగా ఫేర్వెల్ డే వేడుకలు



నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 1 (వార్తా వేదిక సూర్య )

నల్గొండ లోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కంప్యూటర్ ఇంజనీరింగ్ విద్యార్థులు" ఫ్రెషర్స్, ఫేర్వెల్ సెలబ్రేషన్" పార్టీ ని ఎంతో ఆనందంగా నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలు,పాటలు, క్లాసికల్, ఫోక్ డాన్స్‌లతో ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమం లో కంప్యూటర్ విభాగం హెడ్ మాదూరి ఆధ్వర్యంలో స్టాఫ్ సహకారంతో విజయవంతంగా జరిగింది. అన్ని విభాగాల హెడ్‌లు పాల్గొని విద్యార్థుల భవిష్యత్తు కోసం విలువైన సూచనలు ఇచ్చారు. ప్రిన్సిపాల్ సి. హెచ్ నరసింహరావు మాట్లాడుతూ ..విద్యార్థులకు రాబోయే సెమిస్టర్ పరీక్షలకు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని సూచిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. సివిల్ విభాగం హెడ్, సీనియర్ మోస్ట్ హెడ్ ఎం. సైదులు విద్యార్థులను ఆశీర్వదించి, కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు.

విద్యార్థులందరికీ భవిష్యత్తులో విజయవంతమైన జీవితం ఉండాలని దీవించారు. విద్యార్థులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల అభ్యర్థన పై సివిల్ విభాగం హెడ్, సీనియర్ మోస్ట్ హెడ్ సైదులు "ఎర్రజెండా" పాటకు డాన్స్ చేసి అందరిని ఆనందింపజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, సిబ్బంది కి భోజన ఏర్పాట్లు కూడా చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధ్యాపకులు పాల్గొని కార్యక్రమాన్ని మరింత ఘనంగా తీర్చిదిద్దారు.

# పిఏసిఎస్ చైర్మెన్ ఛాంబర్ లో..... రాత్రి వేళలో మందు పార్టీ.



మోత్కూరు, ఏప్రిల్ 01 (వార్తా వేదిక సూర్య)

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు సింగిల్ విండో కార్యాలయంలో (నాగార్జున రైతుసేవా సహకార సంఘం) ఉద్యోగుల సిట్టింగ్ విషయం కాస్తా బట్టబయలైంది. మంగళవారం రాత్రి వేళ ఆ కార్యాలయంలో ఏకంగా చైర్మెన్ ఛాంబర్ లో నలుగురు ఉద్యోగులు మద్యం బాటిళ్లు, మిర్చి బజ్జీలతో మద్యం పార్టీ చేసుకోవడంతో స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశం కాస్తా కోరం లేకపోవడంతో వాయిదా పడింది.

రైతులకు పూర్తి స్థాయిలో సమావేశం సంబంధించి సమాచారం ఇవ్వలేదని ఓ వైపు ఆగ్రహం వ్యక్తం చేస్తుంటే...అదేరోజు కార్యాలయంలో అర్ధరాత్రి వరకు ఉద్యోగులు మద్యం పార్టీ చేసుకోవడంతో రైతులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాలకవర్గం గడువు ముగియడంతో.. అధికారుల పాలన కొనసాగుతుండటంతో ఉద్యోగులపై అజమాయిషీ లేకపోవడంతోనే ఏకంగా చైర్మెన్ ఛాంబర్ లో ఇష్టారాజ్యంగా మద్యం పార్టీ చేసుకున్నారని రైతులు ఆరోపిస్తున్నారు .సదరు ఉద్యోగులపై సహకార సంఘం ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు, డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన ఆ ఉద్యోగులను మందలించినట్లు తెలిసింది.



# నేడు అన్ని గ్రామాలలో గ్రామసభలు

మోత్కూరు, ఏప్రిల్ 01 (వార్తా వేదిక సూర్య );

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నటువంటి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలలో ఈనెల 2న ఉదయం 10 గంటలకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బాలాజీ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను పొందుటకు గ్రామాల ప్రజలు గ్రామ సభలలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.



## 14 ఏళ్ల లోపు బాలికలందరూ ఈ.హెచ్ పి.వి వ్యాక్సిన్ వేసుకోవాలి

మోత్కూరు, ఏప్రిల్ 01 (వార్తా వేదిక సూర్య ):



14 ఏళ్లలోపు వయసు ఉన్న బాలికలందరూ ఈ హెచ్ పి వి. వ్యాక్సిన్ వేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం స్వప్న కోరారు. బుధవారం స్థానిక పిహెచ్ సి లో జరిగిన వ్యాక్సివేషన్ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్ వేసుకోవడం ద్వారా సర్వైకల్ క్యాన్సర్ ని నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మార్చి8 జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో ప్రారంభమైందని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హేమంత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.హెచ్.ఓ. దేవకి, సూపర్వైజర్ ఊర్మిళ, డిపిఎంవో రమేష్ నాయక్, స్టాఫ్ నర్స్ పరమేశ్వరి, ఎం ఎల్ హెచ్ పి లు, ఏఎన్ఎం లు, పి హెచ్ సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు మోత్కూరుకు ఎమ్మెల్యే రాక.

మోత్కూరు, ఏప్రిల్ 01 (వార్తా వేదిక సూర్య):



మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో నిర్వహించే ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించే గ్రామసభ కార్యక్రమానికి తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం స్వప్న సోమ నర్సయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుండగోని రామచంద్రుగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి పట్టణ కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు ఎన్ ఎస్ యు ఐ యూత్ కాంగ్రెస్ మహిళ ఐఎన్ టియుసి కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# ప్రాణ రక్షకులు ఆపదలో ఆదుకునే
# 108 ప్రాణ యోధులు

**నేడు 108 ఈఎంటి జాతీయ దినోత్సవం**

**ప్రాణ భద్రత కోసం పోరాడే ఐ108 టెక్నీషియన్లు**

**గోల్డెన్ అవర్ లో ప్రాణాలు పోస్తున్న 108 సిబ్బంది**

**అత్యవసర సమయాల్లో ధైర్య సాహసాలు .**




మోత్కూరు, ఏప్రిల్ 01(వార్తా వేదిక సూర్య)
అత్యవసర వైద్య సేవలో అంకితభావంతో సేవలందిస్తున్న 108 అంబులెన్స్ లోని ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ల సేవలను గుర్తించేందుకు జీవీకే ఈఎంఆర్ఐ 108 సంస్థ ఏప్రిల్ 2న ఈఎంటి దినోత్సవం నిర్వహించనుంది.

రోడ్డు ప్రమాదాలలో గుండెనొప్పి , శ్వాస సంబంధ వ్యాధులు,ఆత్మహత్యాయత్నం పాముకాటు ,పేలుడు ప్రమాదాలు ,కరెంటు షాక్ రైలు ప్రమాదాలు కొట్లాటలు కడుపునొప్పి , విరేచనాలు, వడదెబ్బ, మరియు నవజాత శిశువులకు సేవలు అందించడంలో ముందు వరుసలో ఉంటున్నాయి చిన్న ,పెద్ద పేద ,ధనిక అనే తేడా లేకుండా ప్రతిరోజు ఎక్కడో అక్కడ 108 సేవలు ప్రజలకు అందడంలో ఎంతో కీలకపాత్ర వహిస్తున్నాయి అందులో భాగంగానే ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే ఈఎంటి జాతీయ దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రత్యేక కథనం . 108 అంబులెన్స్ సేవలు ప్రారంభం అయినప్పటి నుంచి లక్షలాది ప్రాణాలు కాపాడడంలో ఈఎంటిలు కీలకంగా వ్యవహరిస్తున్నారు. అంబులెన్స్ లోనే మార్గమధ్యంలో ప్రయాణించేటప్పుడు ఎంతో మంది గర్భిణీ స్త్రీలకు ప్రసవం చేయడం వాళ్ళ యొక్క ప్రాణాలను కాపాడి ఒక పునర్జన్మను ఇవ్వడం లాంటిది అటువంటి 108 సేవలు 2005 వ సంవత్సరం నుండి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో చేపట్టబడిన మానస పుత్రికగా చెప్పబడుతున్న 108 సేవలు అభినందించబడినవి అప్పటినుండి ప్రజలకు పగలు రాత్రి అనకుండా ఏడాది పాటు ఎప్పుడూ మేమున్నామంటూ కీలక సేవలను అందిస్తున్నాయి 2020 కరోనా సమయంలో కుటుంబ పెద్ద దిక్కు కూడా దగ్గరకు వెళ్ళలేని పరిస్థితిలో ఉన్న క్రమంలో కూడా 108 సిబ్బంది వారి యొక్క కుటుంబ పెద్దలకు అన్నింటికి ఉన్నామనే ఆత్మవిశ్వాసం కల్పించి అందించిన సేవలు విశ్వసనీయం.

యాదాద్రి జిల్లాలో 12 అంబులెన్సులు ఒక నియోనేటల్ అంబులెన్స్ ఉన్నాయి. గత సంవత్సరం ఫిబ్రవరి నుండి ఇప్పటివరకు ఈ అంబులెన్సులు ట్రామా కేసులు2532, గర్భిణి కేసులు1456, అన్ కాన్షియస్ కేసులు 863, కడుపునొప్పి కేసులు 1667, బ్రీతింగ్ ప్రాబ్లం కేసులు 1132, ట్రామా నాన్ వెకిలర్ కేసులు1204, పాయిజన్ కేసులు 641, కార్డియా కేసులు 1072, ఫిట్స్ కేసులు 554, సూసైడ్ అటెంప్ట్ కేసులు353, స్ట్రోక్ కేసులు 281, ఎనిమల్ ఎటాక్ కేసులు 404, బర్న్స్ కేసులు 54 , సాధారణ మెడికల్ కేసులు 2709 మొత్తం కేసులు 14922 చేశారు.

### ప్రాణాలను లెక్కచేయం. . ఈఎంఈ మహేష్ కుమార్



ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా ప్రాణాలను లెక్కచేయకుండా 108 లో అత్యవసర సేవలు అందించి ఈఎంటిలో చేసే పని చాలా రిస్కుతో ఉన్నప్పటికీ ఎప్పుడు ఏ సమయమైనా ప్రజలకు అందించడమే మా అంకితం. ఎండాకాలంలో వడదెబ్బ కారణంగా వచ్చే ఎమర్జెన్సీలను ప్రథమ చికిత్స అందించడానికి ఓ ఆర్ ఎస్ లు 108 అందుబాటులో ఉంటున్నాయి.. ప్రజలకు నిత్యం అందుబాటులో ఈఎంటి సేవలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తుంది.

### ప్రమాదంలో ఉన్న ప్రజలను కాపాడటమే లక్ష్యం : తొంట భాస్కర్ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్



అత్యవసర 108 సేవలో గత 20 సంవత్సరాలుగా తాను సేవలు అందిస్తున్నా.. ప్రమాదంలో ఉన్నవారిని అనేకమందిని కాపాడాను ఆ కాపాడటంలో ఆనందం మించింది ఇంకా ఎక్కడ దొరకదు. ఉత్తమమైన ప్రథమ చికిత్స అందిస్తూ మెరుగైన వైద్యం అందే వరకు బాధితునికి తమ దగ్గర ఉన్న అన్ని రకాల పరికరాలను ఉపయోగించి సేవ చేయడమే తమ ముందున్న లక్ష్యం. కరోనా లాంటి ఎన్నీ పరిస్థితి వచ్చిన దేనికి భయపడలేదు. ప్రజలకు సేవ చేయడమే ప్రతినిత్యం ముందుంటున్నాం.

### 108 సేవలు వెలకట్టలేనివి బిబిఎం.డి. సలీం



ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్. . 108లో ఈఎంటి సేవలు వెల కట్టలేనివి ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ అందించే ప్రథమ చికిత్స ఒక కుటుంబ పెద్దదిక్కు ప్రాణ రక్షణకు కీలకపాత్ర పోషిస్తున్నాయి.



## కష్ట పడ్డ వారికి పార్టీ లో సముచిత స్థానం

**మున్సిపల్ చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్**

యాదగిరిగుట్ట ఏప్రిల్ 1 (వార్త వేదిక సూర్య ) :
పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం డీసీసీ సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు...నూతనంగా నియమించబడిన డీసీసీ జిల్లా జనరల్ సెక్రెటరీ,జిల్లా సెక్రటరీ, జిల్లా డాక్టర్స్అసోసియేషన్ అధ్యక్షులను శాలువతో సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ లో కష్టపడిన ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంగ సత్యనారాయణ,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బంధారపు భిక్షపతి,మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్,వైస్ చైర్మన్ రమ్య రామచందర్,మాజీ ఎంపీపీ చీరశ్రీశైలం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఉప సర్పంచ్ గుండ్లపల్లి భరత్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లు,తదితరులు పాల్గొన్నారు..

## విభజన హామీలు అమలు చేయండి...

**లోకసభలో ఖమ్మం ఎంపీ డిమాండ్...**
**విభజన హామీలు అమలు చేయాలి..**
**తెలంగాణకు న్యాయం చేయండి**
**బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి**
**ఖమ్మం, పాలమూరును పట్టించుకోండి**
**భద్రాచలం నుంచి ఆంధ్రా లో కలిసిన నాలుగు గ్రామపంచాయతీలను తిరిగి ఇచ్చేయండి**
**కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు చేసి, కేటీపీఎస్ విస్తరణ పై దృష్టి సారించాలని గళమెత్తిన రామసహాయం**

న్యూ ఢిల్లీ: వార్త వేదిక సూర్య
ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం--2014 అమలుపై ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి లోక్‌సభలో బుధవారం గళమెత్తారు. విభజన సమయంలో తెలంగాణ అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. సంస్థాగత, ఆర్థిక, మౌలిక రంగాలకు సంబంధించిన పలు కీలక అంశాలను సభ దృష్టికి తీసుకువచ్చారు.హామీలు కాగితాలకే పరిమితం కావద్దు విభజన చట్టంలో తెలంగాణ అభివృద్ధి కోసం అనేక హామీలు, కట్టుబాట్లు ఉన్నప్పటికీ, వాటి అమలు ఇంకా పూర్తికాలేదని రఘురాం రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ హామీలు కాగితాలకే పరిమితం కాకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

జాతీయ స్థాయి విద్యాసంస్థలు అవసరం

తెలంగాణలో ఎన్‌ఐటి (చీ×ు), ఐఐఎం (××వీ), ఐఐఎస్ఇఆర్ (××ూజు=), సెంట్రల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. ఇప్పటికే ఉన్న విద్యాసంస్థలను జాతీయ ప్రమాణాలకు తీసుకెళ్లాలని సూచించారు.

పారిశ్రామికాభివృద్ధి, ఐటీ విస్తరణ

ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధికి కేంద్రం మద్దతు ఇవ్వాలని, హైదరాబాద్ ఇప్పటికే ఐటీ హబ్‌గా ఉన్నందున దాన్ని మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఖమ్మం జిల్లా ప్రస్తావన

మహబూబ్‌నగర్, ఖమ్మం వంటి వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి సెక్షన్ 94(2) కింద రావాల్సిన ఆర్థిక తోడ్పాటు ఇంకా పూర్తిగా అందలేదని పేర్కొన్నారు. ఈ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ఎప్పుడు..?

సెక్షన్ 93 ప్రకారం బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు హామీ ఇంకా నెరవేరలేదని పేర్కొంటూ దీనిపై స్పష్టత ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు.

నీటి వనరులపై న్యాయం

గోదావరి, కృష్ణా నదులు తెలంగాణలోనే అత్యధికంగా ప్రవహిస్తున్నందున, రెండు రాష్ట్రాల్లో కృష్ణా, గోదావరి నది యాజమాన్య బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలని కోరారు.

కేటీపీఎస్ కు సంబంధించి..

కేటీపీఎస్ (ఖూూ) థర్మల్ పవర్ స్టేషన్‌కు అదనంగా 825 మెగావాట్ల సామర్థ్యాన్ని పునరుద్ధరించాలని సూచించారు.

మౌలిక సదుపాయాల అభివృద్ధి

రీజనల్ రింగ్ రోడ్ (ఆర్‌ఆర్‌ఆర్) కోసం.. అదనపు నిధులు కేటాయించాలని కోరారు.

కొత్తగూడెంకు ఎయిర్ పోర్ట్ కావాల్సిందే..

వరంగల్‌కు విమానాశ్రయం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతూ, కొత్తగూడెం మరియు ఆదిలాబాద్/పెద్దపల్లి ప్రాంతాల్లో కూడా విమానాశ్రయాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.జఔఎ ఢ రాశీఝశ్రీ +బఱఅవం

మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టుకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరారు.

భద్రాచలం గ్రామాల సమస్యపై..

రెండో సవరణలో భద్రాచలం అసెంబ్లీ పరిధిలోని నాలుగు గ్రామ పంచాయతీలు ఆంధ్రప్రదేశ్‌లో విలీనం కావడంతో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆ గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలని కేంద్రాన్ని కోరారు.

ఏపీ సోదర, సోదరీమణులారా..

అది బ్లాక్ డే కాదు..

రెండు రాష్ట్రాల అభివృద్ధికి చక్కటి అవకాశం

ఆంధ్రప్రదేశ్ సోదర సోదరీమణులరా.. అని పేర్కొని ప్రత్యేకంగా విన్నపం చేస్తూ... రాష్ట్ర విభజనను ఒక చీకటి రోజుగా చూడవద్దని సూచించారు. ఇది రెండు రాష్ట్రాల అభివృద్ధికి గొప్ప అవకాశమని పేర్కొన్నారు.

సమాన న్యాయం చేయాలి..

ఆంధ్రప్రదేశ్‌కు అదనపు నిధులు ఇవ్వడంపై తమకు ఎటువంటి అభ్యంతరం లేదని, అయితే అదే విధంగా తెలంగాణ అభివృద్ధికి కూడా ఈ బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని కేంద్రాన్ని కోరారు. రెండు రాష్ట్రాలు సమానంగా అభివృద్ధి చెందేలా చూడాలని సూచిస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.

## భార్య హత్య కేసులో నాలుగేళ్లుగా పరారీలో...

**గ్యాస్ బుకింగ్‌తో పట్టుబడిన వ్యక్తి...**




భార్య హత్య కేసులో నాలుగేళ్లుగా పరారీలో ఉన్న ఒక వ్యక్తి గ్యాస్ బుకింగ్ చేసి పోలీసులకు పట్టుబడిన సంఘటన మధ్యప్రదేశ్‌లో జరిగింది. సందీప్ తోమర్ అనే మాజీ ఆర్మీ కెప్టెన్ 2013లో పంజాబ్‌లోని అబోహర్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో తన భార్యను హత్య చేశాడు. మొదట ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేసినప్పటికీ, విచారణలో హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు.

భార్య హత్య కేసులో కోర్టు అతడిని దోషిగా నిర్ధారించి, 2014లో జీవితఖైదు విధించింది. 2019లో అతడికి బెయిల్ రావడంతో బయటకు వచ్చాడు. అప్పీలును 2022లో హైకోర్టు కొట్టివేసినప్పటికీ అతడు లొంగిపోలేదు. అప్పటి నుంచి తన గుర్తింపు, లొకేషన్లు మార్చుతూ తప్పించుకుని తిరుగుతున్నాడు. సందీప్ తోమర్‌ను అరెస్టు చేసేందుకు పంజాబ్ పోలీసులు సిట్‌ను ఏర్పాటు చేశారు.

అతడి పాన్‌కార్డుతో అనుసంధానమై ఉన్న బ్యాంకు ఖాతాను పోలీసులు ట్రేస్ చేశారు. ఈ అకౌంట్ ద్వారా తోమర్ మధ్యప్రదేశ్‌లోని పాండుర్నాలో ఒక ఎల్పీజీ గ్యాస్ బుక్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. గ్యాస్ ఏజెన్సీని సంప్రదించిన పోలీసులు అతడి వివరాలు తెలుసుకున్నారు. పాండుర్నాలో అతడిని అరెస్టు చేసిన పోలీసులు, కోర్టులో హాజరుపరిచారు. కోర్టు అతడిని జ్యుడిషియల్ కస్టడీకి పంపించినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

## బార్ అసోసియేషన్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం




చౌటుప్పల్ ఏప్రిల్ 2 వార్త వేదిక సూర్య
చౌటుప్పల్ బార్ అసోసియేషన్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ లొ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు చెన్నూరి రాధా కిషన్ రావు మరియు కానుగుల వెంకటయ్య అధ్యక్షతన నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు తాడూరు పరమేష్ మాట్లాడుతూ భవిష్యత్తులో చౌటుప్పల్ పట్టణంలో మరో అడిషనల్ కోర్టు మరియు సబ్ కోర్టు అదేవిధంగా కోర్టులకు కావలసిన శాశ్వత భవన నిర్మాణం కొరకు నూతన పాలకవర్గం కృషి చేస్తుందని అదేవిధంగా అడ్వకేట్ ఫెటర్నిటీ కోసం కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపినారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శిగా పడమటి మహిపాల్ రెడ్డి మరియు ఉపాధ్యక్షులుగా పిట్టల బిక్షమయ్య , సహాయ కార్యదర్శిగా మక్తాల నరసింహ, లైబ్రరీ సెక్రెటరీ గా నర్రి స్వామి ,స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా దేశ



గోని శ్రీశైలం , మహిళ ప్రతినిధి నకరికంటి జ్యోతి , ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ఎండి. ఖయ్యూం పాషా పిల్లలమర్రి కిరణ్ గార్లు ప్రమాణ స్వీకారం చేశారు నూతన కార్యవర్గాన్ని మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బాల్యశీ వెంకటాచలం గారిచే ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు బాల్యం వెంకట చలపతి, ఉడుగు శ్రీనివాస్, ఎలమోని శ్రీనివాస్, ఎన్నికల అధికారులు సిహెచ్ రాధాకృష్ణ రావు, కానుగు వెంకటయ్య, న్యాయవాదులు రాపోలు వేణు, ముత్యాల సత్తిరెడ్డి, తడక మోహన్, జెల్ల రమేష్, బడుగు శ్రీకాంత్, జక్కర్తి శేఖర్, దాచేపల్లి చంద్రబాబు, బొంగు గోపాల్, రిక్కల సుధాకర్ రెడ్డి, కట్టెల లింగస్వామి,అవ్వారు చేతన్, పాల పరమేష్, ఎష్ట. జంగయ్య జె. శ్రీశైలం, భరత్ కుమార్, అయితేగొని శ్రీకాంత్, మల్లికార్జున్, విజయ్, మరియు కోర్టు సిబ్బంది మరియు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ బీర్ల చిత్రపటానికి పాలాభిషేకం



**యాదగిరిగుట్ట ఏప్రిల్ 01 ( వార్త వేదిక సూర్య ) :**మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం టెక్నికల్ ఫీల్డ్ అసిస్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జిల్లా అధ్యక్షులు కొండమడుగు రమేష్, ప్రధాన కార్యదర్శి కోడిత్యాల నాగరాజు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న మాకు ఎలాంటి ఉద్యోగ భద్రత, రెటైర్మెంట్స్ బెనిఫిట్స్, ప్రతినెల జీతాలు సరిగా రావడం లేదని అయిలయ్యకు విన్నవించగా ప్రభుత్వ దృష్టికి తీసికు వెళ్తానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు.అందకు గాను శాసనసభ సమావేశాల్లో ఉపాది హామీ పథకంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినందుకు కృతజ్ఞతలు తెలపి పాలభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో కోశాదికారి యెల్లోజు రామచంద్రయ్య చారి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా అంగన్వాడి కేంద్రం-2లో స్వపరిపాల దినోత్సవం

**- పిల్లలకు సంతోషకరమైన బాల్యాన్ని అందించాలి సర్పంచ్ అలకుంట్ల సుధాకర్**



**గుండాల,ఏప్రిల్ 01 (వార్తవేదిక సూర్య) :** బ్రాహ్మణపల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రం-2లో స్వపరిపాల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళా సంఘ సభ్యులు, పిల్లలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ అలకుంట్ల సుధాకర్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో స్వపరిపాలనకు ఉన్న ప్రాముఖ్యతను వివరించారు. గ్రామ ప్రజలు సమిష్టిగా పనిచేస్తే గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని తెలిపారు.అంగన్వాడి టీచర్ మరియు సిబ్బంది పిల్లలకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు పాటలు, నృత్యాలతో అందరినీ ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, మహిళా సంఘాలు, గ్రామ పెద్దలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చివరగా పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేసి కార్యక్రమాన్ని ముగించారు.అంగన్వాడి స్వాపరిపాలన దినోత్సవంలో గ్రామ సర్పంచ్ గా దొంతరబోయిన వేదాన్ష్,అంగన్వాడీ టీచర్ గా -బాకీ అన్విత-చాచీవీ- బొర్ర ఆరాధ్య ఆయమ్మ -మేడ అద్విత ఆశ వర్కర్ -ఆలకుంట్ల నిహారిక పాత్రలు పోసించి ఆనంద వ్యక్తం చేశారు.

## యాట విష్ణు మాతృమూర్తికి నివాళులు



**రామన్నపేట ఏప్రిల్ 1(వార్తా వేదిక సూర్య)** రామన్నపేట సిపిఐఎం పట్టణ కమిటీ సభ్యులు యాట విష్ణు మాతృమూర్తి అనారోగ్యంతో బుధవారం మరణించడంతో వారి పార్దివదేహానికి పూల మాల వేసి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెల్లల పెంటయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు కందుల హనుమంతు, జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మునికుంట్ల లెనిన్, గొరిగె సోములు, బావాండ్లపల్లి బాలరాజు, సత్యం, తరిగొప్పుల వెంకటరెడ్డి, నకిరేకంటి రాము, కుందూరు వెంకటేశ్వర్లు, బోల్లా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## డా.బి ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ ఎన్నిక



**రామన్నపేట ఏప్రిల్ 1(వార్తా వేదిక సూర్య)** రామన్నపేట మండల కేంద్రంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకునేందుకు మండల వ్యాప్తంగా అంబేద్కర్ వాదులు బుధవారం స్థానిక రహదారి బంగ్లాలో సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీని ఎన్నుకోవడం జరిగింది కమిటీ కన్వీనర్ గా బొడ్డు సురేందర్ రావు కో కన్వీనర్ గా నాగటి ఉపేందర్ సోషల్ మీడియా కన్వీనర్ గా ఎర్ర నరేష్ లతో పాటుగా కమిటీ సభ్యులుగా మరో 13 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని అన్ని గ్రామాల నుండి అంబేద్కర్ అభిమానులను సమీకరణ చేసి మండల కేంద్రంలో భారీ ర్యాలీతో జయంతి ఉత్సవాలను నిర్వహిస్తామని అన్నారు నూతన కమిటీ సభ్యులుగా నల్ల స్వామి,నోముల చిరంజీవి, కంచి మధుసూదన్, కోళ్ల రామకృష్ణ,కక్కిరేణి విజయ్ కుమార్,భాష మల్ల సంతోష్,గాదె నరేందర్, నకిరేకంటి నరేందర్, బొడ్డు శంకర్,జన పాల లక్ష్మణ్,నకరికంటే మొగులయ్య, బలుగూరి అంజయ్య,ఏలూరి రవి, నీ ఎన్నుకున్నారు.

# సిపిఐ పార్టీకి చేయూతనివ్వండి

**▸▸ ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో గోదా శ్రీరాములు**

**యాదగిరిగుట్ట ఏప్రిల్ 01 ( వార్త వేదిక సూర్య ) :** మండలంలోని చిన్న కందుకూరు గ్రామంలో ఇంటింటికి సిపిఐ ప్రచారంలో పాల్గొన్న సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, పేరబోయిన మహేందర్ లు మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్టు పార్టీ ఈ దేశంలో ఆవిర్భవించి 100 సంవత్సరాలు దాటిన నేపథ్యంలో, మతోన్మాద కార్పొరేట్ కబంధహస్తాల నుండి దేశాన్ని విముక్తి చేసి సమసమాజ స్థాపన కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్న ఏకైక పార్టీ సిపిఐ అని అన్నారు . కార్మికులు, రైతులు, మహిళలు, విద్యార్థులు, యువజనులు తదితర ప్రజాసంఘాలను నిర్మించి, వెట్టి చాకిరి నిర్మూలనకు, కార్మికులు, కర్షకులను దోపిడి నుండి విముక్తి చేయడానికి సిపిఐ పోరాటాలు సాగించిందని పేర్కొన్నారు.అమరవీరుల రక్త త్యాగాలతో ఎన్నో విజయాలు సాధించి, భారతదేశ రాజకీయ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న పార్టీ సిపిఐ అని అన్నారు . నిరంకుశ నిజాం పాలనను గద్దె దించడానికి జరిగిన మహత్తర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో సుమారు నాలుగున్నర వేల మంది ప్రాణత్యాగంతో 3000 గ్రామాలను విముక్తి చేసి, దాదాపు 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనమైన చరిత్ర సిపిఐదని గుర్తుచేశారు.భవిష్యత్తులో ప్రజా పోరాటాలను మరింత బలోపేతం చేయడానికి భారత కమ్యూనిస్టు పార్టీకి అన్ని వర్గాల ప్రజలు తమ సహకారం అందించి ప్రజా ఉద్యమాల నిర్మాణానికి తోడ్పాటు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్య దర్శి కలిపెల్లి




మహేందర్, మున్సిపల్ కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్, పేరబోయిన పెంటయ్య, ఉపసర్పంచ్ కాటం శ్రీకాంత్, నమిల సంజీవ, తుమ్మల ఉపేందర్, రాకల మహేందర్, రేఖల మల్లుస్వామి, కలిపెల్లి శ్రీశైలం, కాటం బాలయ్య, గడ్డం నర్సయ్య, కల్లెపెల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంచెలంచెలుగా స్వసక్తితో కష్టపడి ఎదిగిన నాయకుడు అడ్లూరి లక్ష్మణ్

**- బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్**

**యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 1 (వార్తా వేదిక సూర్య ):** రాష్ట్ర మంత్రివర్యులు మరియు ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇంచార్జ్ అడ్లూరి లక్ష్మణ్ ఎస్సీ ఎస్టీ వికలాంగుల సంక్షేమ శాఖ మాత్యుల జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సహృదయ అనాథ ఆశ్రమంలోని వృద్ధులకు బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో అన్నదానం- పండ్లు పంపిణీ చేస్తూ మాట్లాడుతూ అట్లూరి లక్ష్మణ్ గారు విద్యార్థి దశ నుండి ఎన్ఎస్ఈఐ యువజన కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీలో ఇందిరా గాంధీ రాజీవ్ గాంధీ గారిలా స్ఫూర్తితో పేదలకు సమసమాజ స్థాపనలో సమానత్వం కల్పించడం కోసం కాంగ్రెస్ పార్టీ విధివిధానాలతో క్రమశిక్షణ కళా కార్యకర్తగా పార్టీ అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్న పార్టీలో పదవులు వచ్చినా రాకుండా నిరాశ చెందకుండా గ్రామ స్థాయి( జడ్పిటిసి) నుండి అచ్చలంచలుగా రాష్ట్ర మంత్రివర్గంలో పనిచేస్తూ ఎన్నో సంవత్సరాలుగా ఎస్సీలలో వైరుధ్యంగా ఉన్న ఏబిసి వర్గీకరణ కోసం తన వంతుగా ప్రయత్నం చేసి తెలంగాణ రాష్ట్రంలో దళితులలో వెనుకబడిన వర్గాలలో విద్య వివిధ రంగాలలో సామాజిక రాజకీయ ఆర్థికంగా బలోపేతం అవ్వడం కోసం ఆయన చేస్తున్నటువంటి కృషిని ఆదర్శంగా తీసుకొని



మానవ దృక్పథంతో సేవ చేయాలనే ఆలోచనతో బుధవారం భువనగిరి పట్టణ శివారులోని రాయగిరి వార్డులో సహృదయ అనాథ ఆశ్రమంలోని అనాథ వృద్ధులకు అన్నదానం మరియు పండ్లు పంపిణీ గావించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న మంత్రి మంత్రి లక్ష్మణ్ తో పాటు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సమాజహితం కోసం ప్రతీ ఒక్కరూ బాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఎండి అలీ, రాష్ట్ర సేవా కార్యదర్శి పిట్టల బాలరాజు, పట్టణ సేవాదళ్ అధ్యక్షుడు డాకూరి ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండి అఖిల్,గోపే బాబు పాల్గొన్నారు.

## జాతీయ వాద ఉద్యమ మహోన్నత నాయకుడు హెడ్గే వార్

**- నివాళులు అర్పించిన బిజెపి నేత రచ్చా శ్రీనివాస్**



**యాదగిరిగుట్ట ఏప్రిల్ 1 ( వార్త వేదిక సూర్య ) :** హిందూ సమైక్యత కోసం ఆర్ఎస్ఎస్ ను స్థాపించి హిందూ సమాజాన్ని ఏకం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగిన డాక్టర్ కేశవరావు బలిరాం హెడ్గేవార్ జయంతి సందర్భంగా రాష్ట్ర బిజెపి కౌన్సిల్ సభ్యులు రచ్చ శ్రీనివాస్ ఘనంగా నివాళులు అర్పించారు.1925 లో విజయదశమి రోజున ఆర్ఎస్ఎస్ ను స్థాపించిన హెడ్గెవార్ అకుంఠిత త్యాగభావకుడని, సమర్థవంతమైన నాయకుడని రచ్చ శ్రీనివాస్ అన్నారు. హిందూ సమాజాన్ని మేలుకొలిపి జాతీయ వాద సిద్ధాంతాలను ఉద్భోదించిన ఆయన స్ఫూర్తితో ముందుకు సాగడమే... ఆయనకు నిజమైన జయంతి నివాళులు అన్నారు..

## ఎన్.సి.డి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్





**మోటకొండూరు,ఏప్రిల్ 1 (వార్తా వేదిక సూర్య ):**ఫేస్ -2, ప్రజా పాలన- ప్రగతి పాలన లో బా గముగా ఎన్ సి డి స్క్రీనింగ్ వైద్య శిబిరాన్ని కాటేపల్లి గ్రామ సర్పంచ్ శ్రీమతి పచ్చిమట్ల జయమ్మ మదార్ గౌడ్, ఉపసర్పంచ్ వల్లాల పుష్పలత వెంకటేష్ తో కలిసి మండల వైద్యాధికారి కట్టా విజయ్ .. గ్రామపంచాయతీ కార్యాలయంలో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సర్పంచ్, వైద్యాధికారి మాట్లాడుతూ. ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా.. ప్రభుత్వం పనిచేస్తుందని ఈ వైద్య శిబిరాలను గ్రామ ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో నమోదు అయిన ఓ.పి సంఖ్య 98 కాగా వీరందరికీ బీపీ షుగర్ పరీక్షలు నిర్వహించి బి.పి 36మందికి, సుగర్ 24మందికి ఉచితంగా మందులను అందజేసి, కంటి, ఈ ఎన్ టి, ఇతర సమస్యలు గల 12మందిని పై స్థాయిఆసుపత్రులకు చికిత్స నిమిత్తం రిఫర్ చేశారు.ఈ క్యాంపులో వైద్య సిబ్బంది నరసింహ, శ్రీనివాస్, పార్వతమ్మ, పద్మావతి, నిర్మల, గ్రామ సెక్రెటరీ మల్లేషా, ఆశా కార్యకర్తలు సావిత్రి, లావణ్య, కరోబార్ కవిత, శానిటేషన్ సిబ్బంది మదార్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి దైవభక్తితో సైకిల్ పై ముందుకు



**మోత్కూరు, ఏప్రిల్ 01 (వార్త వేదిక సూర్య):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమగోదావరి పెంటపహాడ్ మండలం రాచర్ల గ్రామానికి పెండ్యాల భాస్కర్ రావు తనకు కొద్దికాలం క్రితం అనారోగ్యానికి గురి కావడంతో తాను వెంకటేశ్వర స్వామి భక్తునిగా తన ఆరోగ్యం కుదుటపడితే తమ గ్రామం నుండి యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని సైకిల్ యాత్ర చేసి దర్శించుకుంటానని మొక్కుకున్నట్లు భాస్కర్ రావు తెలిపారు. ఇటీవల తన ఆరోగ్యం కుదుటపడటంతో తాను సైకిల్ పై స్వగ్రామం నుండి 7 రోజుల క్రితం సైకిల్ యాత్ర మొదలుపెట్టి బుధవారం మోత్కూరుకు చేరినట్లు భాస్కర్ రావు “వార్తా వేదిక సూర్య”తో తన అనుభవాలను వెల్లడించారు. యాదగిరిగుట్ట లో శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శించుకున్న తర్వాత తిరిగి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ద్వారక తిరుమలను దర్శించుకుంటానని తన సైకిల్ యాత్ర అంతటితో ముగిస్తుందని ఆయన తెలిపారు.

## మన మోత్కూర్ వాట్సప్ గ్రూప్ సేవలు అభినందనీయం

**- మృతుని కుటుంబానికి వాట్సప్ గ్రూప్ చేయూత.రూ 33 వేల నగదు క్వింటా 25 కిలోల బియ్యం అందజేత**

**మోత్కూరు, ఏప్రిల్ 01 (వార్త వేదిక సూర్య ):** ప్రతినిత్యం పేద ప్రజలకు అండగా నిలుస్తున్న మన మోత్కూర్ వాట్సప్ గ్రూప్ సేవలు అభినందనీయమని మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ బొల్లెపల్లి వెంకటయ్య,మార్కెట్ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి లు అన్నారు. మోత్కూరు మున్సిపల్ కేంద్రానికి చెందిన కన్నెబోయిన సతీష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మన మోత్కూర్ వాట్సప్ గ్రూప్ దాతలు,సభ్యుల సహకారంతో అందించిన రూ.33 వేల చెక్కు, 1క్వింటా 25 కిలోల బియ్యం వారి చేతుల మీదుగా బుధవారం మృతుని భార్య ఎల్లమ్మకు స్వయంగా అందజేశారు.మన మోత్కూర్ వాట్సప్ గ్రూప్ జిల్లాలోనే ఆదర్శనీయమైందని,ప్రతి ఒక్కరూ ఈ గ్రూప్ ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ రామ లింగేశ్వర ఆలయ చైర్మెన్ గుండగోని రామచంద్రు,మాజీ మున్సిపల్



కో ఆప్షన్ సభ్యులు గనగాని నర్సయ్య, కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న, వాట్సప్ గ్రూప్ ప్రతినిధులు ధబ్బేటి సోంబాబు, కోమటి మత్స్యగిరి,చోల్లేటి నరేశ్, మొరిగాల శ్రీను, కోమటి జనార్దన్, జంగ నర్సయ్య,పురుగుల రమేష్,జంగ సతీష్,వడకాల యాదగిరి,కె.గిరి తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా, ఇజ్రాయిల్ లు ఇరాన్ పై చేస్తున్న యుద్ధం ఆపాలి

**▸▸ ఎస్, వీరయ్య సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు**

**వలిగొండ, ఏప్రిల్ 1 (వార్తా వేదిక సూర్య ):** యాదాద్రి భువనగిరి జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు వలిగొండ మండలం నాగారం గ్రామంలోని ఆర్బిఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. ఈ తరగతిలకు ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్య వాదం అనుసరిస్తున్న విధానం వల్ల ప్రపంచ శాంతికి విగాథం కలిగిస్తుందని అమెరికా తన ఆయుధ సంపత్తిని పెంచుకోవడానికి తమ దగ్గర ఉన్న ఆయుధాల నిలువలను అమ్ముకోవడానికి అన్ని దేశాలను తమ ఆధీనంలోకి తెచ్చుకోవడానికి పెత్తనం చేస్తుందని యుద్దాలను సృష్టించడం కోసం వెనిజులా,ఇరాన్,క్యూబా తమకు గిట్టని దేశాలపై కవ్వింపు సైనిక చర్యలు చేస్తూ ప్రపంచంలోని అన్నిదేశాల పైనతమ పెత్తనం కొనసాగిస్తూ అంతర్జాతీయ న్యాయ సూత్రాలన్నిటిని ఉల్లంఘించి ఏకధృవ ప్రపంచం సాధించడం కోసం అమెరికా తప్పుడు పద్ధతుల్లో ఆయా దేశాల సార్వభౌమాధికారాన్ని దెబ్బతీస్తుంది.యుద్దాలను తన వ్యాపారాన్ని విస్తరింప చేయడానికి ప్రయత్నం చేస్తుంది.ట్రంపు తమ మాట వినని దేశాలపై విచ్చలవిడిగా పన్నుల శాతాన్ని పెంచి వేస్తుంది.దీనివల్ల అన్ని రకాల వస్తువులపై అధిక ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. ఇన్ని రోజులుగా జరుగుతున్న యుద్ధం వల్ల గ్యాస్ ,పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడి భారతదేశ ప్రజలు తీవ్ర ఆందోళనకు గురి గురవుతున్నారు. అక్కడ ఎక్కడో యుద్ధం జరిగితే మన ఇండ్లలో సరుకుల ధరలు పెరుగుతున్నాయి. భారతదేశంలో ఎగుమతులు దిగుమతుల పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.యుద్ధం వల్ల ఎవరికి లాభంలేదు అమెరికా అధ్యక్షుడు ట్రంపు తప్పుడు విధానాల వల్ల మన దేశ సాధారణ ప్రజలు పేద ప్రజల జీవితాలు చితికి పోతున్నాయి.భారతదేశ పాలకులు స్వతంత్ర విధానం తీసుకోవాలి.అమెరికా ట్రంప్ ఒత్తిళ్లకు తలగొద్దు.మన పజలపైభారాలు పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి.ఉపాధి ఉద్యోగాలను కాపాడాలన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు




ఎండి జహంగీర్ మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యల్ని పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో ఏప్రిల్ నెల మొత్తం స్థానిక సమస్యల్ని గుర్తించి వాటి పరిష్కారం కోసం దశల వారి పోరాటాలని నిర్వహించి 20 నుండి 30 తేదీ వరకు తహసిల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నామని తెలిపారు . ఈ క్లాసులకు కల్లూరు మల్లేశం ప్రిన్సిపల్ గా వ్యవహరించగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, దాసరి పాండు, జల్లెల పెంటయ్య, బూరుగు కృష్ణారెడ్డి,శ్రీనివాస చారి, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యులు తు-ర్కపల్లి సురేందర్, మెరుగు వెంకటేశం,కందడి సత్తిరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి భువనగిరి
సంపుటి : 1 సంచిక : 306
వార్త వేదిక సూర్య
యాదాద్రి భువనగిరి గురువారం, ఏప్రిల్ 2, 2026

# కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వం

- దాసరి పాండు తెలంగాణ భవన్ నిర్మాణం వర్కర్స్ యూనియన్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు



**భువనగిరి, ఏప్రిల్ 1 (వార్తా వేదిక సూర్య) :** సిఐటియు ఆధ్వర్యంలోభువనగిరి లోని జగదేవ్పూర్ చౌరస్తా వద్ద భవన నిర్మాణ కార్మికులతో కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసే విధానాన్ని ఉపసంహరించుకోవాలని నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పెట్టుబడు దారులకు కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను ఈరోజు నుంచి రద్దుచేసి నూతన చట్టాలు అమలులోకి తీసుకురావడం కోసం ప్రయత్నం చేయడం సరైనది కాదని ఏళ్ల తరబడిగా అనేక పోరాటం త్యాగాలు చేసే కార్మిక వర్గం సాధించుకున్న హక్కులను మార్పులు చేసి ఉన్న హక్కులను ఏ ఒక్కటి కూడా కార్మికులకు వర్తింప చేయకుండా అన్ని రంగాల కార్మికుల శ్రమ దోచుకోవడానికి సులభతర వ్యాపారం పేరుతో పరిశ్రమలు యాజమాన్యాలకు దేశంలో ఉన్న భూములు సంపద కారు చౌకగా తీసుకునే అవకాశం కల్పిస్తూ కార్మికులకు ఏలాంటి హక్కులను లేకుండా చేస్తూ తక్కువ వేతనాలు చెల్లిస్తూ పని చేయించుకోవాలని యాజమాన్యులకు అవకాశం కల్పిస్తుందని ఇప్పటికే పోరాడి సాధిస్తున్న కార్మిక చట్టాలైన ఈఎస్ఐ ఫీ ఎఫ్ సమాన పనికి సమాన వేతనం కనీస వేతనం సౌకర్యాలు కల్పించడం లేదని అమలు చేయడం ఈ సమస్యల మీద పట్టించుకోవాల్సిన ప్రభుత్వం చూసి చూడనట్టుగా వ్యవహరిస్తూ యాజమాన్యాల ఊడిగం చేస్తూ కార్మికులతో వెట్టి చాకిరి చాకి రి చేయించుకుంటుందని ఈరోజు నుండి కార్మిక చట్టాలను రద్దుచేసి నూతన కార్మిక చట్టాలను అమలు చేయాలని చూస్తున్నా ప్రభుత్వం విధానానికి వ్యతిరేకంగా కార్మికవర్గం ఐక్యంగా ఉద్యమానికి సిద్ధం కావాలని వారు అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మాయ కృష్ణ పట్టణ కార్యదర్శి గంధ మల్ల మాతయ్య నాయకులు బాలయ్య ఎల్లయ్య యుగేందర్ అమరేందర్ రాములు లక్ష్మి కవిత అండాలు తదితరులు పాల్గొన్నారు



## పారిశుద్ధ్య పనులను పరిశీలన



**మోత్కూరు, ఏప్రిల్ 01 (వార్తా వేదిక సూర్య ):** మండలంలోని పనకబండ గ్రామంలో పారిశుద్ధ్య పనులను, నర్సరీ, కాంపోరేస్ట్ షెడ్ లను, అంగన్ వాడి కేంద్రాన్ని స్థానిక సర్పంచ్ లోతుకుంట రేణుక కలిసి మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ ) జనార్ధన్ రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల తయారీ విషయంలో పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం చేయడం పట్ల ఇది పద్ధతి కాదని హెచ్చరించారు. పారిశుద్ధ పట్ల సిబ్బంది పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. నర్సరీ మొక్కలను వాటరింగ్ చేయించడంలో విధుల పట్ల అలసత్యం వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండల తీవత అదృష్ట గ్రామంలోని పశువులకు నీటి తొట్లకు మరమ్మతులు చేయించి మూగజీవులకు త్రాగునీరు అందించాలని ఆదేశించారు. పారిశుద్ధం పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. పని చేయని ఎంపిలపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

## ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తున్న సిపిఐకి విరాళాలు ఇవ్వండి



**మోత్కూరు, ఏప్రిల్ 01(వార్తా వేదిక సూర్య);** బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) కి ప్రజలు విరాళాలు ఇచ్చి ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి. యానాల దామోదర్ రెడ్డి కోరారు. సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో ఇంటిం టికి సిపిఐ కార్యక్రమాన్ని దామోదర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడానికి ఈ కార్యక్ర మాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా అనేకమంది నిరుపేద ప్రజలు ఎక్కువ శాతం ఇందిరమ్మ ఇల్లు కావాలని, పెద్దప్ప పెన్షన్లు కావాలని తమ దృష్టికి తీసుకువ చ్చారని అన్నారు. తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి జంగ నర్సయ్య, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి గొలుసుల యాదగిరి. బీసీ హక్కుల సాధన సమితి మండల అధ్యక్షులు పెండెం వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు నిలిగొండ అశోక్, మానుపాటి సాయిలు, పంగ యాదగిరి, గంగాదేవి చంద్రయ్య, నిలిగొండ రాములు, మహిళామ్ సంఘం పట్టణ అధ్యక్షులు నల్ల పుష్పమ్మ, జంగ జాంగిరమ్మ, గొలుసుల పిచ్చమ్మ, నిలిగొండ అండాలు, జంగ సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఏకరూప దుస్తుల కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించిన సీఎంఓ



**మోత్కూరు, ఏప్రిల్ 01 (వార్తా వేదిక సూర్య ):** జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మోత్కూరులో జరుగుతున్న ఏ. పి. పి. సి. ఏకరూప దుస్తుల కుట్టు శిక్షణ కేంద్రాన్ని జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి పెసరు లింగారెడ్డి బుధవారం ఆకస్మికంగా సందర్శించి శిక్షణ జరిగే పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన స్వయం సహాయక సంఘాలు మహిళలు తన స్వంత పిల్లలకు దుస్తులు తయారుచేసిన విధంగా నాణ్యమైన రీతిలో తయారు చేసి అందించాలన్నారు. విద్యార్థుల కొలతలు తీసుకుని, ఆ కొలతల ప్రకారమే ఏకరూప దుస్తులు కొట్టాలని మహిళలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్. డి.ఎ. జిల్లా ఏపీఎం పసునూరి రమణ, శిక్షణ కేంద్రం ఇంచార్జి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ పాలక కమిటీ చైర్మన్ దంతురి మల్లయ్య గౌడ్ ఏకగ్రీవం

- ఏకగ్రీవంగా నూతనంగా సుద్దాల హనుమన్ ఆలయ పాలక కమిటీ చైర్మన్ బత్తిని మహేష్ గౌడ్
- ఎన్నో జన్మల పుణ్యం చేసుకుంటే కానీ ఈ అవకాశం మాకు దక్కింది నూతన ఆలయ కమిటీ చైర్మన్స్
- ఆలయ కమిటీ చైర్మన్ నూతనంగా నియమితులైన దంతురి మల్లయ్య గౌడ్ కి బత్తిని మహేష్ గౌడ్ ఘన సన్మానం ప్రశంసల జల్లులు అభినందనలు







**గుండాల (వార్త వేదిక సూర్య) ఏప్రిల్ 01 :** ఈ సందర్భంగా నూతన ఆలయ కమిటీ చైర్మన్ లు మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించినందుకు మాకు చాలా సంతోషంగా ఉందన్నారు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తులను ఉద్దేశించిహా వేణుగోపాల స్వామి,హనుమాన్ స్వామివారి సేవ చేయుటకు మాకు కల్పించిన ఈ అవకాశాన్ని మరింత దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తామని గ్రామా పెద్దలు ప్రజలు కమిటీ సభ్యుల సహకారంతో భక్తుల సహకారంతో దేవాలయానికి మరింత శోభను తీసుకొచ్చే అభివృద్ధి కార్యక్రమాలకు మా శాయశక్తుల ప్రయత్నిస్తామని ఆలయాలు ఆంజనేయ స్వామి గుడి వేణుగోపాల స్వామి అందరి సహకారంతో అభివృద్ధి బాటలోహౌగేలా కృషి చేయడమే మా ధ్యేయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటీ సభ్యులు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో అయ్యప్పస్వామి పడి పూజ



**మోత్కూరు, ఏప్రిల్ 01 (వార్త వేదిక సూర్య ):** మోత్కూరు మండలంలోని ముషిపట్ల గ్రామంలోని బుగ్గరామలింగేశ్వర స్వామి గుట్టపైన ఉన్న హరిహర పుత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం అయ్యప్ప జన్మదినాన్ని పురస్కరించుకొని భక్తులు అత్యంత శ్రద్ధలతో పడిపూజను నిర్వహించారు. ముందుగా గణపతి హోమం జరిపి,గణపతి, సుబ్రమణ్య స్వామి, అయ్యప్పస్వాములకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అయ్యప్పస్వామి కి పంచామృతాలతో పాటు గంధం, విభూతి, పసుపు,కుంకుమ, పూలు,పండ్లతో అభిషేకాలు జరిపి పూలు పండ్లు దీపాలతో అలంకరించిన పడి 18 మెట్లపై కర్పూరం వెలిగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదం అందించారు.పూజా కార్యక్రమాలను పురోహితులు మోత్కూర్ ప్రదీప్ శర్మ, మోత్కూర్ సందీప్ శర్మ, హర్షవర్ధన్ శర్మ లు ఆధ్వర్యంలో శాస్త్రోశికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పైళ్ల నర్సిరెడ్డి, ఉప సర్పంచ్ అంజయ్య, బుగ్గరామలింగేశ్వర స్వామి దేవాలయ కమిటీ ఛైర్మన్ మడిగే శేఖర్, అయ్యప్పస్వామి భక్తులు మజ్జిగ మధుసూదన్ రెడ్డి, బాహుపెల్లి విజయ్ కుమార్, తండ సత్తయ్య, సూధగాని పాండు, పట్టురి శివ,బీసు రాంబాబు, బండారు రాజేంద్రప్రసాద్, ఆరాని శేఖర్, బండ నర్సిరెడ్డి, బద్దీశెట్టి సంతోష్, శేఖర్,బాసోజు లక్షణా చారి,చెన్నూరు శ్రీపతి, జిల్లా కంకరత్నం,పొలాసు సాయి కిరణ్, సోమన్న,మజ్జిగ హర్షవర్ధన్ రెడ్డి,బండి నర్సింహ,తాంద్ర నారా యణ స్వామి, కరుణాకర్ ,రాధారపు మల్లేష్,మేరుగు రాజశేఖర్, నర్సింహ,శ్రీను, కృష్ణారెడ్డి, వీరస్వామి,రాంరెడ్డి, తాడూరి నరేందర్ దశరథ రెడ్డి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతీ విద్యాలయంలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవ వేడుకలు






**ఆత్మకూరు (ఎం), ఏప్రిల్ 01,(వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం సరస్వతీ విద్యాలయంలో స్వపరిపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా స్థానిక సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ విచ్చేసి చిన్నారుల యొక్క ప్రతిభను కొనియాడారు విద్య యొక్క గొప్పతనాన్ని ,విశిష్టతను అలాగే క్రమశిక్షణతో ఉండాలని తల్లిదం డ్రులను గౌరవించాలని విద్యార్థులకు సూచించారు. ఇట్టి కార్యక్రమంలో బిఆర్ఎస్ మండలం మహిళా అధ్యక్షురాలు సోలిపురం అరుణ మాట్లా డుతూ చదువుతోపాటు సంస్కారం అలవర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు ప్రజా ప్రతినిధులుగా , అధికారులుగా వివిధ హోదాలలో వేషధారణతో వారి యొక్క ప్రతిభను కనబరిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ తౌర్ర విష్ణు,పాఠశాల ప్రిన్సిపల్ పంజాల నరసయ్య మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు అలాగే చదువు చెప్పిన గురువులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఐలయ్య ,పేరెంట్స్ కమిటీ చెర్మన్ బూడిద శేఖర్ గౌడ్ ఉపాధ్యాయులు చెరుకు విష్ణు ,సుధాకర్ ,యాసిన్ ,లలిత, సంతోష ,మహేశ్వరి ,సంధ్య, మాధవి,కృష్ణవేణి ,గంగ ,లక్ష్మి ,రేణుక, లావణ్యలు పాల్గొన్నారు.

## అడ్డదారిలో అనుమతులు లేకుండా అంబుజా సిమెంటు పరిశ్రమ పనులు చేస్తే సహించేది లేదు

- పర్యావరణ పరిరక్షణ వేదిక



**రామన్నపేట ఏప్రిల్ 1, (వార్తావేదిక సూర్య)** అదాని లాజిస్టిక్స్ లిమిటెడ్ పేరుతో అంబుజా సిమెంట్ కాలుష్య పరిశ్రమ పనులు చేస్తే మరో మహా ప్రజా పోరాటం తప్పదని పర్యావరణ పరిరక్షణ వేదిక కన్వీనర్ జల్లెల పెంటయ్య, కో-కన్వీనర్ ఎండీ రెహాన్ హెచ్చరించారు. రామన్నపేట అంబుజా సిమెంట్ ప్రతిపాదిత స్థలంలో భారీ యంత్రాలతో ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్న పనులను పర్యావరణ పరిరక్షణ వేదిక, అఖిల పక్షాల ఆధ్వర్యంలో స్థానిక నాయకులు పరిశీలించి పనులు బుధవారం అడ్డుకున్నారు ఈ సందర్భంగా జల్లెల పెంటయ్య,ఎండి రెహన్ మాట్లాడుతూ విష కాలుష్యంతో ప్రజల ప్రాణాలు తీసే అంబుజా సిమెంట్ పరిశ్రమ నెలకొల్పవద్దని మండల ప్రాంత ప్రజానీకం పెద్ద ఎత్తున ఆందోళన చేయగా వెనక్కి తగ్గి మళ్ళీ ఏదో సాకుతో పనులు ప్రారంభించడం సరికాదని అన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా భారీ యంత్రాలతో పనులు జరుపుతున్నారని ఏ నిర్మాణానికి అనుమతి ఉన్నదో ప్రజలకు మీడియా ముందు బహిరంగంగా చూపించాలని, స్థానిక గ్రామపంచాయతీకి సమాచారం అందించాలని అన్నారు. దొడ్డి దారిన పనులు ప్రారంభిస్తే ప్రాంత ప్రజలు చూస్తూ ఊరుకోరని మరో ప్రతిఘటన పోరాటం తప్పదని అన్నారు. రైతులకు మాయమాటలు చెప్పి నమ్మించి తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసి కాలుష్యంతో పర్యావరణం దెబ్బతీసే అంబుజా సిమెంట్ పరిశ్రమను నెలకొల్పాలని చూస్తుంటే ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు ముక్తకంఠంగా వ్యతిరేకించారని దీనిపై జిల్లా కలెక్టర్,కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ప్రజలకు బహిరంగంగా సమాధానం చెప్పాలని అడ్డదారిలో భారీ యంత్రాలతో పనులు చేస్తే సహించమని అన్నారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ వేదిక అఖిలపక్షాల నాయకులు గోదాస్ పృథ్వీరాజ్, ఊట్కూరు నర్సింహా, ఎండీ జమీరుద్దీన్,మిర్జా ఫజల్ బెగే, శానగొండ వెంకటేశ్వర్లు ,కొమ్ము శేఖర్, మోట మహేష్, సుదర్శన్ ,కొమ్ము రామస్వామి అంబాల అశోక్, గురిజాల మహేష్ రెడ్డి, జల్లెలమల్లేష్,సమ్మయ్య,శీను వీరమళ్ళ లింగస్వామి, ఆకిటి శేఖర్, కల్లూరి శివ తదితరులు పాల్గొన్నారు







Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305,** Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**